




GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 137 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 బుధవారం 06 ఆగస్టు 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్





# అద్వానీ రికార్డు బ్రేక్

## అత్యధిక కాలం హోంమంత్రిగా అమిత్ షా

న్యూఢిల్లీ,ఆగస్టు5 (సమయజ్యోతి):

ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించినట్లుగానే హోంమంత్రి అమిత్ షా కూడా అత్యధిక కాలం హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది.





ముంబై తరవాత ప్రారంభానికి సిద్ధం

11న షోరూమ్ ప్రారంభానికి నిర్ణయం

## ఢిల్లీలో టెస్లా రెండో అడుగు

న్యూఢిల్లీ,ఆగస్టు5 (సమయజ్యోతి):

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి ఇప్పటికే అడుగుపెట్టింది. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైంది. దేశ రాజధాని ఢిల్లీలో తన సెకెండ్ షోరూంను తెరవబోతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీలో టెస్లా సెకెండ్ షోరూంను ఆగస్టు 11న ఓపెన్ చేయనుంది.

## మరిన్ని సుంకాలు పెంచుతాం

భారత్‌కు ట్రంప్ హెచ్చరికలు

వాషింగ్టన్,ఆగస్టు 5(సమయజ్యోతి):

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ట్రంప్ విధించిన 25 శాతం సుంకాల నిర్ణయం అమలులోకి వచ్చింది. 6వ తేదీ నుంచి భారతీయ సరుకులపై ఈ సుంకాల వసూళ్లు ఆరంభం అవుతాయి. అయితే మరోసారి ట్రంప్ సుంకాల పెంపు విషయంలో మరోసారి కఠిన నిర్ణయం తీసుకున్నారు. రానున్న 24 గంటల్లో భారత్‌పై సుంకా లను గణనీయంగా పెంచుతామని ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తెలిపారు. ఆమెరికాకు భారత్ మంచి వాణిజ్య భాగ స్వామి కాదని అన్నారు. అమెరికాతో భారత్ పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహిస్తుంది.. కానీ, అమెరికా మాత్రం భారత్‌తో వ్యాపారం చేయదని స్పష్టం చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తోందని.. తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందని ఆక్రోశాన్ని వెళ్లగక్కారు.



ఆరు లైన్ల రహదారిగా

## విజయవాడ హైవే

కేంద్రమంత్రి గడ్కరిని కలిసి కోరిన మంత్రి

తమ్ముడికి మంత్రిపదవి ఇప్పించే స్థాయి కాదన్న కోమటిరెడ్డి

న్యూఢిల్లీ,ఆగస్ట్5(సమయజ్యోతి):

మల్కాపూర్ నుంచి విజయవాడ వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలుగా విస్తరించడంతో పాటు- సర్వీస్ రోడ్లను నిర్మించాలని కేంద్ర గడ్కరీని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికోరారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశ మయ్యారు. వచ్చే వారం ప్రధాన మంత్రితో సమావేశం అవనున్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై గడ్కరీతో సుదీర్ఘంగా చర్చించారు.

## రాజ్యసభలో సిఐఎస్ఎఫ్ సిబ్బంది రాక

అధికార పార్టీ తీరుపై మండిపడ్డ సభ్యులు

గందరగోళం మధ్య తొలుత వాయిదా

అమిత్ షా కనుసన్నల్లో నడుస్తోందన్న ఖర్గే

న్యూఢిల్లీ,ఆగస్టు 5(సమయజ్యోతి):

రాజ్యసభ జరుగుతున్న తీరుపై విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం అమిత్ షా కనుసన్నల్లో సభను నడుపుతున్నారని మండిపడ్డారు. మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పార్లమెంట్ ఉభయసభల్లోనూ ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహిస్తుండడం, ప్రతిపక్షాల గొంతులను అణచివేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంతకు ముందు ఛైర్మన్ స్థానంలో ఉన్నవారు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడం కూడా సమావేశాల్లో భాగమే అని భావించేవారన్నారు. కానీ ప్రస్తుతం సభల్లో మాట్లాడడానికి కూడా అవకాశం ఇవ్వకుండా తమ ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నారంటూ మండిపడ్డారు. హోంమంత్రి అమిత్‌షా సూచనల ప్రకారం సభలో నడుచుకుంటున్నారని.. అసలు సభను నడిపిస్తున్నది మీరా లేక అమిత్ షా నా? అని డిప్యూటీ- ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్‌ను ఖర్గే ప్రశ్నించారు.



## ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు



- ధరాలి గ్రామంపై విరుచుకుపడ్డ వరద
- జలప్రవాహానికి నలుగురు మృతి
- వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు
- సిఎం పుష్కర్ సింగ్ ధామితో ప్రధాని, హోంమంత్రి ఆరా

డెహ్రాడూన్,ఆగస్టు 5(సమయజ్యోతి):

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. ఇక్కడి ధరాలీ గ్రామంపై జలప్రవాహం విరుచుకుపడింది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు సమాచారం. దాదాపు 50 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని, 20-25 హోటళ్లు, నివాసాలు కొట్టుకుపోయి ఉండొచ్చని స్థానికులు పేర్కొంటు-న్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. కుంభవృష్టి కారణంగా ఎగువ ప్రాంతమైన ఖీర్‌గఢ్ నుంచి మెరుపు వరదలు సంభవించి నట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఎస్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి.

## ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నాం

చేతల ప్రభుత్వమని చేసి చూపుతున్నాం- ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

మేడ్చల్,ఆగస్టు 5(సమయజ్యోతి):

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలంగాణ ఐటీ-, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మాటలతో కాకుండా పనుల చేసి తమది చేతల ప్రభుత్వమని చెబుతున్నామని అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి పంపిణీ చేశారు.



కాళేశ్వరం నివేదికలో

## మొత్తం గ్యాస్, ట్రాష్

లీకులు ఇచ్చి వార్తలు రాయించుకుంటున్నారు

అసెంబ్లీలో చర్చ పెడితే ఎండగడతాం: కెటిఆర్

న్యూఢిల్లీ,ఆగస్ట్5(సమయజ్యోతి):

కాళేశ్వరం నివేదికలో మొత్తం గ్యాస్, ట్రాష్ మాత్రమే తప్ప అందులో ఏమీ లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. 650 పేజీల పూర్తి నివేదిక ఎవరూ చదవక ముందే అడ్డమైన రోత వార్తలను రెండు పత్రికలు రాస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 655 పేజీల కమిషన్ నివేదికను 60 పేజీలకు కుదించడంలోనే కాంగ్రెస్ భాగోతం అర్థమైందని విమర్శించారు.

## తెలంగాణ భవన్‌లో హరీష్ రావు ప్రజెంటేషన్

- కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్
- కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ
- తుమ్మడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది
- ఇదంతా కుట్రల నివేదిక అని కొట్టి పారేసిన హరీష్ రావు

హైదరాబాద్,ఆగస్టు5 (సమయజ్యోతి):

కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గత 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి రాజకీయ కక్షలు సాధించేందుకే కమిషన్లను ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. డబ్బులు దంచుకోవడానికీ, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికీ ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక రిపోర్ట్, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందు ఒక రిపోర్ట్, స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇంకో రిపోర్ట్.. ఇవన్నీ కుట్రలో భాగం. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇచ్చారు.60 పేజీల రిపోర్ట్ కుట్రతో బయట పెట్టారు. అసలు 650 పేజీల రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టండి, చీల్చి చెండాడుతాం అని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే తప్పు పట్టినట్లు ఉందని హరీష్ విమర్శించారు. కమిషన్ ఒకవైపే విని ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది ట్రాష్, బేస్‌లెస్. గతంలో ఇందిరా గాంధీ, చంద్రబాబు మీద వచ్చిన రిపోర్టులు న్యాయస్థానాల్లో నిలబడలేదు.



మొదటిపేజీ తరువాయి

# అద్వానీ రికార్డు బ్రేక్

దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998-1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీకేంద్ర హోం మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు. ఇక కేంద్ర హోం శాఖ బాధ్యతలు చేపట్టిన అమిత్ షా తన హయాంలో ఆర్టికల్ 370 రద్దు సహా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా దేశంలో నక్సలిజంపై ఉక్కుపాదం మోపుతున్నారు. మొత్తంగా అమిత్ షా అత్యధిక కాలం హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా రికార్డు నెలకొల్పారు.

మొదటిపేజీ తరువాయి

# రాజ్యసభలో సిఐఎస్ఎఫ్ సిబ్బంది రాక

ఖర్గే వ్యాఖ్యలపై హరివంశ్ నారాయణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధ్యక్షుడు తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మరోవైపు సీఐఎస్ఎఫ్ సిబ్బందిని సభలోకి తీసుకువచ్చారని.. వారు ప్రతిపక్ష నేతలను తమ ప్రజాస్వామ్య హక్కులు వినియోగించుకోకుండా నిరోధిస్తున్నారని ఆరోపిస్తూ ప్రతిపక్ష నేతలు రాజ్యసభలో గందరగోళం సృష్టించారు. వారి వాదనను హరివంశ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు తోసిపుచ్చారు. ప్రతిపక్ష నేతలు సభను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రాజ్యసభ మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. రాజ్యసభలో సీఐఎస్ఎఫ్ సిబ్బందిని మోహరించారని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలపై కేంద్రమంత్రి జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ సమావేశాల్లో ప్రతిపక్షాలు ఎలా వ్యవహరించాలనే విషయాన్ని తాను చాలాసార్లు ఈ వ్యక్తులకు చెప్పినప్పటికీ వారు తమ తీరు మార్చుకోవట్లేదని మండిపడ్డారు. తాను దాదాపు 40 ఏళ్లకు పైగా ప్రతిపక్షంలో ఉన్నానని.. ప్రతిపక్ష స్థానాల్లో ఉన్న నేతలు ఎలా ప్రవర్తించాలో నేర్చుకోవాలంటే తన దగ్గర ట్యూషన్ చెప్పించుకోవాలని విపక్ష నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎందుకంటే వారు ఆ స్థానంలో కేవలం పదేళ్లు మాత్రమే ఉన్నారని మరో 40 ఏళ్లు అక్కడే ఉండాలి కాబట్టి ఇటువంటి విషయాలు నేర్చుకోవాలని చురకలు అంటించారు

మొదటిపేజీ తరువాయి

# ఆకస్మిక వరదలు

సహాయక చర్యల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం భారత సైన్యాన్ని అప్రమత్తం చేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఐటీబీపీ బృందాలు ఘటనా స్థలానికి బయల్దేరి రంగంలోకి దిగినట్లు- సమాచారం. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల విషయంలో సీనియర్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు- వెల్లడించారు. ఉత్తరకాశీ ప్రాంతంలోని ధరాలీలో కుండపోత వర్షాల వల్ల భారీ నష్టం జరిగిందనే వార్త చాలా బాధాకరమన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికార బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యల్లో నిమగ్నమై పనిచేస్తున్నాయని తెలిపారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నట్లు- తెలిపారు. బాధిత ప్రజలకు సాధ్యమైనంతగా అన్ని విధాలా సహాయం అందిస్తామన్నారు. అందరూ సురక్షితంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు- తెలిపారు. మరోవైపు.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సీఎం ధామీకి ఫోన్ చేసి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్రం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ధరాలీ ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రధాని మోదీ సంఘీభావం ప్రకటించారు. ముఖ్యమంత్రి పుష్కర్ ధామీతో మాట్లాడి వివరాలు ఆరా తీసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో సహాయ బృందాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలీగ్రామం మెరుపు వరదలకు పూర్తిగా కొట్టుకు పోయింది. సముద్రం మీద పడిందా అన్న స్థాయిలో మేఘం వర్షించింది. దీంతో నీరు, అక్కడున్న మట్టి కలిసి భారీ ఎత్తున బురద వరద ధరాలిని కప్పేసింది. దీంతో ఇప్పుడు ఆ ప్రదేశం మరు భూమిని తలపిస్తోంది. చార్‌ధామ్ యాత్రికులు ఎక్కువగా ఈ గ్రామాన్ని సందర్శిస్తుంటారు. యాపిల్స్‌కు ప్రసిద్ధిగాంచిన ఉత్తరాఖండ్‌లోని హర్సిల్ లోయ ఇక్కడకు కేవలం 6 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఉత్తరాఖండ్‌లో మారుమూల ఉన్న అత్యంత రమ్యమైన ప్రదేశాల్లో ఒకటి. దీని సమీపం నుంచే భాగీరథి నది ప్రవహిస్తోంది. రిషికేశ్ నుంచి బయల్దేరి చంబా, ఉత్తరకాశీ, హర్సిల్ మీదుగా ఇక్కడికి వెళ్లవచ్చు. సముద్రమట్టానికి దాదాపు 2,680 మీటర్ల ఎత్తున ఈ ప్రదేశం ఉంది. ఇక్కడి నుంచి గంగోత్రి ధామ్ కేవలం 20 కిలోమీటర్ల దూరం. గ్రామం మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతుంది. చార్‌ధామ్ సహా ఇతర తీర్థయాత్రల సీజన్‌లో ధరాలీ గ్రామానికి సందర్శకులు భారీ సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో లాడ్జిలు, అతిథి గృహాలున్నాయి. తక్కువ ధరలకే వసతి లభిస్తుండటంతో.. యాత్రికులు వీటి వైపు మొగ్గుచూపుతారు. ఇక్కడి నుంచి 32 కిలోమీటర్ల దూరంలో నీలాంగ్ లోయ ఉంది. భారత్-టిబెట్ మధ్య వ్యాపారం జరిగే పాత మార్గం ఇక్కడి నుంచి వెళుతుంది. ఇక్కడ రాత్రిళ్లు బస చేయడానికి అనుమతి లేదు. ఈ ప్రదేశాలను వీక్షించాలన్నా అటవీశాఖ అనుమతి ఉండాలి. ఇక ధరాలీ సమీపంలోని హర్సిల్ లోయలో భారీ విస్తీర్ణంలో యాపిల్ తోటలున్నాయి. చార్‌ధామ్ యాత్రికులు గంగోత్రికి వెళ్లే సమయంలో ఇక్కడ ఉండేందుకు ఇష్టపడతారు. కేదార్ తాల్ ప్రదేశానికి ట్రెక్కింగ్‌కు వెళ్లేవారికి ఈ ప్రాంతం బేస్‌క్యాంప్‌గా ఉంటుంది. ధరాలీ గ్రామం సమీపంలోని ఖీర్‌గఢ్ నదీ పరివాహక ప్రదేశంలో భారీ వర్షం కారణంగా నీరు నిలిచింది. ఇది ఒక్కసారిగా ధరాలీ మార్కెట్ ప్రదేశంపై విరుచుకుపడింది. ఆగస్టు 10వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. తాజాగా చోటు-చేసుకున్న మెరుపు వరదల్లో 20 నుంచి 25 హోటళ్లు, హోమ్‌స్టేలు కొట్టు-కుపోయాయి. అతి తక్కువ సమయంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం నమోదు కావడాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ముఖ్యంగా గంటలోపు 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో 10 సెంటీ-మీటర్లకు పైగా వర్షం కురిస్తే దానిని క్లౌడ్ బరస్ట్‌గా పేర్కొంటు-ంటారు. ఇక 5 సెంటీ-మీటర్ల కంటే తక్కువ ఉంటే వాటిని మినీ క్లౌడ్ బరస్ట్‌గా పేర్కొంటాం. ఇటు-వంటి వర్షాలు సాధారణంగా పర్వతాలు, కొండ ప్రదేశాల్లో కురుస్తుంటాయి. ముఖ్యంగా హిమాలయాల్లో తరచూ వీటిని చూడొచ్చు. భారీ ప్రాణ, ఆస్తి నష్టాలకు దారితీసే ఈ క్లౌడ్‌బరస్ట్‌లు గతంలోనూ చోటు చేసుకొన్నాయి.

# ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి: టిఎస్పిటిఎ

**హైదరాబాద్, ఆగస్టు 5, 2025:సమయజ్యోతి**

తెలంగాణలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న కీలక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం (టిఎస్పిటిఎ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టిఎస్పిటిఎ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ మరియు కార్యదర్శి ఆర్. రోహిత్ నాయక్ మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సమస్యలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు.

**సంఘం ప్రధానంగా ప్రభుత్వానికి చెప్పిన డిమాండ్లు క్రింది విధంగా ఉన్నాయి:**

- ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీస్ నిబంధనలు అమలు చేయడం
- భాషా పండితుల పోస్టుల అప్‌గ్రేడ్ మరియు సంబంధిత లాభాల కల్పన
- పది వేల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయ పోస్టుల మంజూరు
- ఎన్‌సీఈఆర్టీ నోటిఫికేషన్ కి ముందు బి.ఎడ్ అర్హతతో నియమితులైన ఎస్జీటీలకు సామాన్య సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించడం
- ప్రతి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు సంబంధం లేకుండా ఇద్దరు ఉపాధ్యాయుల నియామకం
- జివో 472 ప్రకారం ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉపాధ్యాయుల కేటాయింపు
- విద్యా హక్కు చట్టం ప్రకారం ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి దూరంగా ఉంచడం
- నిలిచిపోయిన నెలనెలా పదోన్నతుల ప్రక్రియను శాశ్వతంగా కొనసాగించడం
- ఎంఈఓ పోస్టుల భర్తీ కోసం ఆంధ్రప్రదేశ్ లో అనుసరించిన విధానాన్ని తెలంగాణలో అమలు చేయడం

**ఈ సమస్యలపై స్పందించిన వేం నరేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ:**



"మాది ఉద్యోగ మిత్ర ప్రభుత్వమే. ఉద్యోగులను ప్రభుత్వ వ్యవస్థలో అంతర్భాగంగా చూస్తున్నాం. కానీ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం రాష్ట్రాన్ని ముప్పై ఏళ్ల వెనుకకు నెట్టింది. అయినప్పటికీ, మేం ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఆర్థిక పరిస్థితులు మెరుగవగానే ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతాయి." అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను జీరో స్థాయికి తీసుకు రావాలని నిరంతరం ఆదేశాలు ఇస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారుడిగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వేం నరేందర్ రెడ్డి గారికి టిఎస్పిటిఎ రాష్ట్ర శాఖ తరఫున సయ్యద్ షౌకత్ అలీ కృతజ్ఞతలు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణ భవన్‌లో హరీష్ రావు ప్రజెంటేషన్

**కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్**

**కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ**

**తుమ్మడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది**

**ఇదంతా కుట్రల నివేదిక అని కొట్టి పారేసిన హరీష్ రావు**

**హైదరాబాద్,ఆగస్టు5 (సమయజ్యోతి):**

కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గత 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి రాజకీయ కక్షలు సాధించేందుకే కమిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. డబ్బులు దంచుకోవడానికీ, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికీ ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక రిపోర్ట్, బీఆర్ఎస్ రజతోత్సవ సభ ముందు ఒక రిపోర్ట్, స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇంకో రిపోర్ట్.. ఇవన్నీ కుట్రలో భాగం. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇచ్చారు. 60 పేజీల రిపోర్ట్ కుట్రతో బయట పెట్టారు. అసలు 650 పేజీల రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టండి, చీల్చి చెండాడుతాం అని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే తప్పు పట్టినట్లు ఉందని హరీష్ విమర్శించారు. కమిషన్ ఒకవైపే విని ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది ట్రాష్, బేస్‌లెస్. గతంలో ఇందిరా గాంధీ, చంద్రబాబు మీద వచ్చిన రిపోర్టులు న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఇవి కూడా నిలబడవని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయని అని హరీష్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారు. కానీ నిజం ఏమిటంటే, సర్ ఆర్థర్ కాటన్‌ను ఎలా పూజిస్తారో, భవిష్యత్తులో కేసీఆర్‌ను కూడా అలాగే పూజిస్తారు. సీఎం రేవంత్‌కే ఇది తెలుసు. అందుకే మొన్న గంధమల్ల ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టాడని అన్నారు. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు పెట్టడమే కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు అని హరీష్ ఆరోపించారు. ఆ నిర్ణయాన్ని మార్చి మెడిగడ్డకు తీసుకెళ్లిన విషయాన్ని సీడబ్ల్యూసీ కూడా ఆమోదించింది. కాళేశ్వరం డిపిఆర్‌లో అన్నీ క్లియర్‌గా చెప్పాం. నీళ్లు లేక మార్పులు చేయాల్సి వస్తుందని బహిరంగంగానే ప్రకటించాం. కేబినెట్ నిర్ణయం ప్రకారమే ఇది జరిగింది. 2016 జూన్ 3న కేబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తి వివరణ ఇస్తామని హరీష్ సవాల్ విసిరారు. మీకు దమ్ముంటే మైక్ కట్ చేయకుండా మాట్లాడనివ్వాలి. ఆధారాలతోనే చర్చిస్తాం. ఇవాళ కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. తెలిస్తే ఇంకా ఆధారాలు సేకరించేవాళ్లం అని వ్యాఖ్యానించారు. ఈ నివేదికలు వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే, రాజకీయ కక్షలు తీర్చుకోవడానికేనని హరీష్ తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ మంత్రి హరీశ్‌రావు తెలంగాణ భవన్‌లో ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయాల్లో కార్యకర్తలు చూసేలా ఎల్ఈడీ తెరలు ఏర్పాటు- చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను హింసించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం చేసుకుని కాళేశ్వరం నిర్మించాం. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క ప్రాజెక్టు అయినా నిర్మించిందా..?. ధవళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కాటన్ మీద కూడా ఆనాడు బ్రిటిష్ ప్రభుత్వం కమిషన్ వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కేసీఆర్‌ను కూడా భవిష్యత్ తరాలు దేవుడిగా కొలుస్తాయి. కాళేశ్వరం కమిషన్ పేరుతో వండి వార్చిన నివేదికను బయట పెట్టారు. మొత్తం నివేదికను బయటపెట్టలేదు. వాస్తవాలు బయటపెట్టాలన్నదే మా ఉద్దేశం. సీఎం రేవంత్‌రెడ్డి పాలన గాలికి వదిలేసి రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారు. డబ్బులు దండుకునేందుకు కమిషన్లు, ప్రతిపక్షాల మీద కక్ష సాధింపు కోసం రాజకీయ కమిషన్లు. రాష్ట్ర మంతా కమిషన్లమయం చేశారు. కాంగ్రెస్, భాజపా కలిసి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు మూడు సార్లు దెబ్బతిన్నా అక్కడకు ఎన్డీఎస్ఏ వెళ్లలేదు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని కాళేశ్వరం కమిషన్ నివేదిక బయటపెట్టారు. కేసీఆర్, హరీశ్ రావును కమిషన్ పిలవదు అని మొదట అన్నారు..ఆ తర్వాత రాత్రికి రాత్రే కమిషన్ గడువు పెంచారు. పూర్తి నివేదిక బయటపెట్టి అసెంబ్లీలో చర్చ పెడితే... చీల్చి చెండాడుతాం. నచ్చిన పేరాలు లీకులు... నచ్చని నాయకుల్ని బాధ్యులు చేసినట్లు- ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం అనుమతులు ఇచ్చింది, నివేదిక నిజమైతే కేంద్ర ప్రభుత్వాన్ని, అధికారుల్ని తప్పుపట్టినట్లే. ఒక వైపే చూసి, ఒక వైపే విని, ఒక వైపే నిల్చుని ఇచ్చిన నివేదికలా కనిపిస్తోంది. నివేదిక ఒక ట్రాష్.. ఆధారాలు లేని ఆరోపణలు. ప్రాజెక్టుపై ఒక సీఎం సమీక్ష చేయడం ఆయన బాధ్యత.. రాజకీయ జోక్యం ఎలా అవుతుంది? చరిత్రలో ఇలాంటి కమిషన్లు చాలా వచ్చాయి.. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చే నివేదికలు న్యాయస్థానాలు, ప్రజా క్షేత్రంలో నిలబడవు. రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారు. తుమ్మిడి హట్టిని కాంగ్రెస్ ఏ ప్రాతిపదికన చేపట్టిందని ప్రశ్నించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్లకు ఒప్పందం చేసుకొని ఉంటే రాజీనామా చేస్తానని ఉత్తమ్ కుమార్ రెడ్డికి కేసీఆర్ సవాల్ చేశారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసింది? ఒక్క ఎకరాకు అయినా నీళ్లు ఇచ్చారా? రెండేళ్లలో ఢిల్లీకి కమిషన్లు మోశారు.. ప్రతిపక్షాలపై కేసులు, కమిషన్లు తప్ప ఏమీ చేయలేదు. వచ్చే మూడేళ్లు కూడా ఈ ప్రభుత్వం చేసేది ఇదే. కాళేశ్వరంను పడావు పెట్టి బనకచర్లకు నీరు పోవాలన్నది సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన. ముమ్మాటికీ తెలంగాణకు వరప్రదాయని కాళేశ్వరం ప్రాజెక్టు...ఈ విషయం రేవంత్ రెడ్డికి కూడా తెలుసు. కాళేశ్వరం కూలిందని ఓ వైపు అంటారు..మరోవైపు మూసీకి గోదావరి జలాలు తీసుకొస్తామని ఎలా చెబుతారని హరీశ్‌రావు ప్రశ్నించారు.

మొదటిపేజీ తరువాయి

# ఇచ్చిన హామీలు అమలుచేస్తున్నాం

## చేతల ప్రభుత్వమని చేసి చూపుతున్నాం-ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**మేడ్చల్,ఆగస్టు 5(సమయజ్యోతి):**

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలంగాణ ఐటీ-, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మాటలతో కాకుండా పనుల చేసి తమది చేతల ప్రభుత్వమని చెబుతున్నామని అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని చెప్పారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందజేస్తున్నా మన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 వేల రేషన్ కార్డులు అందించామని.. మరో 60 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే అందజేస్తామన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో 'మీ సేవ' కేంద్రాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ- హామీలను నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ-లు ఏర్పాటు- చేసి వారికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు- తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వజ్రేష్ యాదవ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఢిల్లీలో టెస్లా రెండో అడుగు

ఇందుకోసం వరల్డ్‌మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు- తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది . రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది.

ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. అయితే టెస్లాపై మోజుతో ఇండియాలో మార్కెట్ పెరుగుతందని భావిస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఆరు లైన్ల రహదారిగా విజయవాడ హైవే

మంత్రితోపాటు తెలంగాణ ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణం గురించి ప్రయత్నాలు చేస్తున్నాం.. ప్లాన్స్ జరుగుతున్నాయన్నారు. పటౌడీ హౌస్ లో రెండు నెలల్లో పనులు మొదలు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో అనుమతుల కోసం కొంత ఆలస్యం అవుతోందన్నారు. రాజగోపాల్ రెడ్డి ఎపిసోడ్ పై మంత్రి స్పందించారు. నేను మా సోదరుడికి మంత్రి పదవి ఇప్పించే స్టేజ్ లో లేను. కేంద్ర పెద్దలు మాటిచ్చిన విషయం నాకు తెలియదు. నా చేతుల్లో ఏం లేదు. అధిష్టానం, ముఖ్యమంత్రి మంత్రి పదవుల విషయంలో నిర్ణయాలు తీసుకుంటారు. నేను ఢిల్లీకి రాలేదు. మంత్రి పదవి అడగలేదు అని స్పష్టం చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో కార్మికుల 30శాతం వేతన పెంపు డిమాండ్‌తో జరుగుతున్న సమ్మె వివాదంపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు బాధ్యతలు అప్పగించినట్లు- ఆయన తెలిపారు. కార్మికుల డిమాండ్లపై చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్మికులకు జీతాలు పెంచాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌లో బతకాలంటే జీతాలు పెరగాలి. ఢిల్లీ పర్యటన తర్వాత నేను కార్మికులతో నేరుగా మాట్లాడతాను. ఈ అంశాలన్నిటినీ దిల్ రాజుకు అప్పగించాము. ఆయన ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో చర్చలు జరుపుతున్నారుని వెల్లడించారు. ఆయన మరింత మాట్లాడుతూ, 'పాన్ ఇండియా సినిమాలు తీస్తున్నారు. టికెట్ ధరలు పెంచేందుకు మేము అనుమతులు ఇస్తున్నాము. కాబట్టి, కార్మికులు అడుగుతున్న డిమాండ్లపై చర్చించి, నిర్మాతలు తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు..

# 7 నుంచి బాల్కొండలో ఉర్సు ఉత్సవాలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

ఈనెల ఏడో తేదీ నుండి బాల్కొండ మండల కేంద్రం ఆర్మూర్ గల్లీలో హజరత్ సయ్యద్ బుఖారాలి రహమతుల్లాలి ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 7న గంధం సమర్పణ, భక్తులకు అన్నదానం, 8న దీపారాధన కార్యక్రమం ఉంటుందని భారీ ఎత్తున భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని సజ్జాతే నశి సయ్యద్ ఇబ్రహీం కోరారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని మర్తన్నపేట పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో కలకుంట్ల రమణ నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ మంగళవారం పరిశీలించి ఇంటిని త్వరితగతిన పూర్తి చేయడంపై హర్షం వ్యక్తం చేసి, ఆ యజమానురాలని అభినందించినారు. ఇంటికి బేస్ మేట్, రూఫ్ లెవెల్ కింద ఇప్పటికే రూ.2 లక్షలు లబ్ధిదారు బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని వెల్లడించారు. ఆర్ సీ లెవెల్ పూర్తి అయినందున (మూడవ) చివరి చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. తన భర్తకు కంటి సమస్య ఉందని, ఆదుకోవాలని రమణ కలెక్టర్ కు విన్నవించారు. రమణ భర్తకు సిరిసిల్ల పట్టణంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలో వైద్యం చేయించాలని అధికారులకు సూచించారు.



# భవిత కేంద్ర ప్రారంభం

## మండల విద్యాధికారి నిజాముద్దీన్

సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా

మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం భవిత కేంద్రాన్ని మండల విద్యాధికారి నిజాముద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాటలు రాని, చెవులు వినపడని, మానసికంగా వైకల్యం కలిగిన విద్యార్థులు చదువులో పూర్తిగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా చొరవ తీసుకుని వారికి తర్ఫీదు ఇచ్చే కార్యక్రమమే భవిత కేంద్రం ఉద్దేశ్యం అని అన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో మొత్తం 281మంది విద్యార్థులకు గాను దాదాపు 18మంది విద్యార్థులను గుర్తించినట్లు తెలిపారు. వీరందరిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గణేష్ సింగ్, పీఆర్టియూ జిల్లా అధ్యక్షులు వై జనార్ధన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు దండు శేఖర్, ఉపాధ్యాయురాలు జ్యోతి, సిఆర్పి అమీన్ రెడ్డి, ఉపాధ్యాయులు నరేష్, రవి, భారతి, రవికుమార్, ఆస్మా నిషాత్, పద్మావతమ్మ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఎరువులు, పురుగు మందుల దుకాణాల నిర్వాహకులు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హెచ్చరించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణం, గౌరీ శంకర్ ఫెర్టిలైజర్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ సెంటర్లు, గోదాములలో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు అవసరాలకు యూరియా బస్తాలను ముందుగానే తెప్పించి అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారో దానికి అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంచాలని, యూరియా అధిక వాడకం వలన కలిగే నష్టాలను రైతులకు వ్యవసాయ అధికారులు, దుకాణాల నిర్వాహకులు వివరించాలని ఆదేశించారు. యూరియాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై వివరించాలని తెలిపారు. జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఒక వేళ యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, సీసీటీవీ కెమెరాలు లేని గోదాములలో వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అప్జల్ బేగం, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



# కమలాపూర్ లో సిఆర్ఐ పంప్స్ షోరూం ప్రారంభోత్సవం.

సమయజ్యోతి న్యూస్ కమలాపూర్.

కమలాపూర్ మండల కేంద్రంలోని భాగ్యలక్ష్మి ఎలక్ట్రికల్ అండ్ ఇంజనీరింగ్ వర్క్స్ వారు మంగళవారం సిఆర్ఐ పంప్స్ షోరూం ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సిఆర్ఐ జోనల్ మేనేజర్ మధుసూదన్ తెలంగాణ మేనేజర్ కీర్తి శ్రీనివాస్ లు మాట్లాడుతూ.. లో ఓల్టేజీలోఎక్కువ నీటిని సరఫరా చేసే దమ్మున్న పంపు సిఆర్ఐ మాత్రమేనని, ప్రతి 100 మంది రైతుల్లో 90 మందికి పైగా సిఆర్ఐ పంపులను ఇష్టపడతారని, వ్యవసాయ రంగంతో పాటు డొమెస్టిక్ రంగంలో కూడా రకరకాల మోడల్స్ లో సిఆర్ఐ పంపులు సి ఆర్ ఐ కంపెనీ తయారు చేస్తూ ప్రజల మన్ననలు పొంది ఉన్నదని తెలిపారు. కమలాపూర్ మండల ప్రాంతంలో అనేక మంది రైతులు, ప్రజలు సిఆర్ఐ పంపులని ఇష్టపడతారని, ఇక్కడి రైతుల, ప్రజల, మెకానిక్ ల సపోర్టింగ్ సిఆర్ఐ కంపెనీకి ఎంతగానో ఉందని ఈ సందర్భంగా వారు సంతోషం వ్యక్తం చేశారు. ఇట్టి షో రూమ్ ప్రారంభోత్సవానికి స్థానిక సీఐ హరికృష్ణ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తవుటం ఝాన్సీ రవీందర్ సీనియర్ రాజకీయ పార్టీ నాయకులు తక్కల్లపల్లి సత్యనారాయణ రావు, సిఆర్ఐ పంప్స్ కంపెనీ నుండి ముఖ్య అతిథులుగా జోనల్ మేనేజర్ మధుసూదన్, తెలంగాణ మేనేజర్ కీర్తి శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు దీపక్, సురేష్, సర్వీస్ ఇంజనీర్ కన్నన్ లతోపాటు రైతులు మెకానిక్ మిత్రులు మీడియా మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డ్రంకన్ డ్రైవ్ లో పట్టుబడిన 58 మందికి జరిమానాలు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుశిక్ష, జరిమానా తప్పదు,తస్మాత్ జాగ్రత్త.

## సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ.

సమయజ్యోతి న్యూస్ సిరిసిల్ల ప్రతినిధి.

సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు14 రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 58 మంది మందు బాబులు పట్టుబడగా వారిని సిరిసిల్ల పోలీసులుమంగళవారం రోజున కోర్టులో ప్రవేశపెట్టగా 58 మంది మందు బాబులకు జరిమానాలు విధిస్తు సిరిసిల్ల మేజిస్ట్రేట్ జయశ్రీ గారు తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన మందు బాబులకు పట్టణ ట్రాఫిక్ ఎస్.ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు. ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ....ప్రతి రోజు పట్టణ ప్పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు నిర్వహించాడం జరిగుతుందని, మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతు పట్టుబడిన వారికి వారి తల్లితండ్రుల, లేదా కుటుంబ పెద్దల సమక్షంలో కౌన్సెల్లింగ్ ఇవ్వడం జరిగుతుందని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలు కానీ, ఉపాధి అవకాశలకు పోలీస్ వెరైఫికేషన్ సమయంలో ఇబ్బందులు కలుగుతయని, ట్రాఫిక్, రోడ్ భద్రత నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఎస్.హెచ్.జీ సభ్యులు ఆర్థికంగా వృద్ధి చెందాలి

## కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఇందిరా మహిళా శక్తి కింద ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల ఏర్పాటు చేసుకునే అవకాశం పొందిన మహిళలు పకడ్బందీగా వ్యాపారం చేసుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. ఇందిరా మహిళా కింద రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్తన్నపేట గ్రామంలో విశ్వదర్శని గ్రామ సమైక్య మహిళా సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ఎరువులు, విత్తనాలు దుకాణాన్ని కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇందిరా మహిళ శక్తి కింద జిల్లాలోని మహిళా సంఘాలకు ఇప్పటికే క్యాంటీన్లు, డైరీ యూనిట్, కోడి పిల్లల పెంపకం, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంక్, ఇతర స్వయం ఉపాధి యూనిట్లను అందజేస్తున్నామని తెలిపారు. త్వరలో మహిళా సంఘాల సభ్యులకు రైస్ మిల్లులు, సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లా మొత్తం 23 దుకాణాలు మహిళా సంఘాల ఆధ్వర్యలో ఇప్పటికే పలు దుకాణాలు ప్రారంభించామని వివరించారు. ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఏర్పాటు రాష్ట్రంలోనే ప్రథమమని వెల్లడించారు. మహిళా సంఘాల బాధ్యులు, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులు తమ పరిధిలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఎరువులు విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసి మహిళలకు ఆర్థికంగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా వ్యవసాయ అధికారి అప్జల్ బేగం, మార్కెట్ కమిటీ చైర్మన్లు, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు రైతులు ప్రజలు పాల్గొన్నారు.



# అంజన్న ఆలయ అభివృద్ధి పనులు మొదలు పెట్టాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారంలోని హనుమాన్ ఆలయం వద్ద రూ.31 లక్షలతో ఆర్చి, ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మంగళవారం ఆలయం వద్ద పరిశీలించి ఆలయ ఈవో శ్రీనివాస్ నకు, అధికారులకు పలు సూచనలు చేశారు. సిరిసిల్ల - కరీంనగర్ ప్రధాన రహదారి మధ్య నుంచి 50 ఫీట్ల దూరం నుంచి ఆర్చి, ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. టెండర్ ప్రక్రియ ఇటీవల పూర్తి అయిందని వెల్లడించారు.



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# కన్నడనాట అత్యాచార కాండ !

ధర్మస్థలి....ప్రజ్వల్ రేవణ్ణ ఈ రెండు పేర్లు దేశానికి ఇప్పుడు బాగా తెలిసిపోయాయి. ముఖ్యంగా కర్నాటక ప్రజల నోళ్లల్లో నిత్యం నానుతున్న పేర్లుగా చెప్పుకోవాలి. రెండూ ఒకే తరహా కేసులుగా చూడొచ్చు. ధ్మస్థలిలో అమ్మాయిలపై అత్యాచారం చేసి చంపేస్తున్నారని, అదృశ్యం అయిన కేసుల్లో ఇప్పటికీ ఆచూకీ దక్కలేదని గుర్తించారు. అనేకమంది అమ్మాయిల మరణాలు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. ఒకరిద్దరు మాత్రమే ఫిర్యాదు చేశారు. వాటిపై చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో నాటి బిజెపి ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా సీరియస్‌గా లేవు. అందుకే ప్రజల్లో ఉన్న సీరియస్ నెస్ ఇక్కడ కానరావడం లేదు. అందుకే దర్యాప్తు నత్తనడకన సాగిస్తున్నారు. సిట్‌ను వేసినా పెద్దగా ఉపయోగం లేదన్న చర్చ కూడా మొదలయ్యింది. ధర్మస్థలి వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉన్నాయని, మాఫియా ఉందని అంటున్నారు. బాగా పలుకుబడి ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉండడంతోనే అసలు నిజాలు బయటకు రావడం లేదని తెలుస్తోంది. అయితే ఈ కుంభస్థలం ఎప్పుడో బద్దలు కాక తప్పదు. మాజీ సానిటేషన్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుతో కొంత కదలిక వచ్చినా, పాలకుల్లో ఏ మాత్రం చిత్తశుద్ధి లోపించినా దర్యాప్తు ముందుకు సాగదు. ఇకపోతే ప్రజ్వల్ రేవణ్ణ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఓ మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడిగా, ఎంపిగా సాగించినా అత్యాచారకాండ అంతాఇంతా కాదు. దీనిపై చర్చించడం కూడా అవసరం. ఇలాంటి దగుల్బాజీల పాపం పండి జైలు శిక్ష పడింది. లేకపోతే మరింతగా విర్రవీగేవారు. ఎన్‌డిఎ కూటమి పార్టీ జెడిఎస్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక దాడి కేసులు నమోదైనప్పుడు కనీసమాత్రంగా కూడా నేతలు స్పందించలేదు. ప్రజల్వల్ తీర్పును స్వాగతించలేదు. న్యాయస్థానం శిక్ష విధించాక కూడా మోడీ నుంచి కాని, బిజెపి నుంచికాని ఎలాంటి స్పందన లేదంటే మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారికి మద్దతిచ్చినట్లుగా భావించాలి. ప్రజ్వల్‌పై ఒక కేసులోనే శిక్ష పడింది. మరిన్ని కేసులు విచారణలో ఉన్నాయి. వాటిలోనూ బాధితులకు న్యాయం జరిగేలా, నిందితునికి శిక్ష పడేలా అన్ని వ్యవస్థలూ పని చేయాలి. రాజకీయ పలుకుబడి, డబ్బు ఉన్న ప్రజ్వల్ పైకోర్టులను ఆశ్రయించే అవకాశం లేకపోలేదు. తప్పించుకోకుండా పోలీసులు, బాధితులు అప్రమత్తంగా ఉండాలి. ఇకపోతే కేసు వివరాల్లోకి వెళితే..ప్రజ్వల్ రేవణ్ణ నిజంగానే ఓ దుర్మార్గుడు. ఎందరో మహిళల మానాలను దోచుకున్న దుండగుడు. అతనికి జీవితఖైదు విధించడం సరైనదే. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరాలి. ఇకపోతే రేవణ్ణ కేసులు చూస్తే ఆశ్చర్యం కలగమానదు. ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారం జరిపిన కేసులో అభియోగాలు రుజువు కావడంతో మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు బెంగళూరు ప్రజాప్రతినిధుల న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్‌ను దోషిగా నిర్ధారించిన కోర్టు, యావజ్జీవంతోపాటు 11.35 లక్షల రూపాయలు జరిమానా విధించి, దానిలో 11 లక్షలు బాధితురాలికి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మహిళలను కట్టుబానిసలుగా, వారిని సెక్స్ వర్కర్లుగా చూస్తున్న ప్రస్తుత సమయంలో న్యాయస్థానం వెలువరించిన ఈ తీర్పు మహిళలకు ఆశాకిరణం. రోజురోజుకు స్త్రీలపై అఘాయిత్యాల పరంపర కొనసాగుతున్న వేళ మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపిందనే చెప్పాలి. ప్రజ్వల్‌పై మూడు లైంగిక దాడి కేసులు, ఒక లైంగిక వేధింపుల కేసు నమోదుకాగా మొదటి కేసులోనే శిక్ష పడింది. మిగతా కేసులు విచారణలో ఉన్నాయి. మైసూర్ ఆర్‌కె నగర్‌కు చెందిన ఒక మహిళ తనపై ఫాంహౌస్‌లో ప్రజ్వల్ పలుమార్లు అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేయడంతో తొలికేసు నమోదైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో రెండవ తడవ హసన్ నియోజకవర్గం నుంచి ప్రజ్వల్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేశారు. పోలింగ్ ముగిశాక కేసు నమోదు కావడంతో జర్మనీకి పారిపోయాడు. ప్రత్యేక దర్యాప్తు బృందం అతన్ని స్వదేశానికి రప్పించి గతేడాది మే 31న అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి రిమాండ్ ఖైదీగా ప్రజ్వల్ జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. కేసు దర్యాప్తు సమయంలో సిట్ కనుగొన్న విషయాలు విస్తుగొల్పేలా ఉన్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ ప్రజాప్రతినిధిగా సమస్యలపై తన దగ్గరకొచ్చే మహిళలపై లైంగికదాడికి ఒడిగట్టాడు. బెదిరించో బలవంతంగానో లోబరుచుకునో లైంగిక దాడులకు బరితెగించాడు. అత్యాచారం చేసిన ప్రతిసారీ తన ఐ-ఫోన్‌లో ఆ దృశ్యాలను తానే రికార్డు చేసుకున్నాడు. అటువంటి రెండు వేలకు పైచిలుకు వీడియోల ను దర్యాప్తు సందర్భంగా ప్రజ్వల్ ఫోన్‌లో కనుగొన్నారు. అవి మార్ఫింగ్ వీడియోలుగా, రాజకీయ కుట్రగా ప్రజ్వల్ బుకాయించి, తప్పించుకోచూశాడు. అయితే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీడియోలను విదేశాలకు పంపి, ఫోరెన్సిక్ పరీక్షలు చేయించి నిజమైనవేనని నిర్ధారించారు. కేవలం 14 మాసాల్లోనే కేసు ఛేదించడం వెనుక దర్యాప్తు అధికారుల కృషి, కోర్టులో వాదనల సందర్భంగా ప్రాసిక్యూషన్ కనబరిచిన చాకచక్యం అభినందించాల్సిందే. ఇవన్నీ కలిసి ప్రజ్వల్‌ను బోనులో దోషిగా నిలబెట్టాయి. అన్నింటికీ మించినది న్యాయం కోసం, దోషికి శిక్ష పడాలని బాధితురాలు కనబర్చిన పట్టుదల మహిళాలోకానికి స్ఫూర్తినిస్తుంది. ప్రజ్వల్ రేవణ్ణ సాదాసీదా యువకుడు కాదు. కర్ణాటక రాజకీయాలను శాసిస్తున్న కుటుంబానికి చెందిన మాజీ ఎంపి. ఆయన తాత దేవెగౌడ మాజీ ప్రధాని, పినతండ్రి కుమార స్వామి కేంద్ర మంత్రి, తండ్రి మాజీ రాష్ట్ర మంత్రి, ప్రస్తుత ఎంఎల్‌ఎ హెచ్‌డి రేవణ్ణ, తల్లి భవానీ గతంలో కార్పొరేటర్, సోదరుడు సూరజ్ ఎంఎల్‌ఎ. ఇంతమంది రాజకీయ కుటుంబంలో ఉన్న ప్రజల్వల్ తనకు తిరుగులేదని భావించాడు. అత్యాచార బాధితురాలిని అపహరించిన ప్రజ్వల్ తల్లి భవానీపైనా కేసు , ప్రజ్వల్ తండ్రి హెచ్‌డి రేవణ్ణపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణల కేసు నమోదయ్యాయంటే బాధితులను ప్రజ్వల్ కుటుంబం తమ రాజకీయ పలుకుబడితో ఏ స్థాయిలో భయభ్రాంతులకు గురి చేసిందో తెలుస్తుంది. అయితే పాపం పండింది. ప్రజ్వలు ఎంతగా మొత్తుకున్నా సాక్ష్యాలు బలంగా ఉన్నాయి. అత్యాచారాలు చేసి పైశాచికానందం పొంది, వాటిని సెల్ ఫోన్లలో వీడియోలు తీసి మురిసి పోయిన ప్రజ్వల్ లాంటి వారికి జీవిత ఖైదు సరిపోదు. అలాగే ధర్మస్థలిపైనా నిజాయితీగా విచారణ జరగాలి. అప్పుడే ప్రజల్లో భరోసా వస్తుంది. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్దని చాటుకోవడానికి ఇదో మంచి అవకాశం. రాజ్యాంగం పుస్తకాన్నిపట్టుకు తిరుగుతున్న రాహుల్ ఈ విషయంలో తమ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ధర్మస్థలి విషయంలోనూ నిగ్గు తేలేలా చేస్తే మంచిది.

# తెలంగాన జాతి పిత,ఉద్యమ కెరటం ఆచార్య జయశంకర్ సార్.

### ( ఆగస్టు 6న జయశంకర్ సర్ జయంతి సందర్భంగా)

తెలంగాన ఉద్యమ నేతగా,రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించి నీళ్లు, నిధులు,ఉద్యోగాలు,నియామకాలలో తెలంగాన రాష్ట్రం నష్ట పొయింది అంటూ పలు సమావేశాలలో తన గొంతుక ని వినిపించిన తెలంగాన ఉద్యమ మాష్టారు ఆచార్య కొత్తపల్లి జయశంకర్. వీరు 1934 వ సంవత్సరము ఆగస్ట్ 6 వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా లోని ఆత్మకూర్ మండలం అక్కంపేట గ్రామంలో మహాలక్ష్మి,లక్ష్మికాంతా రావు దంపతులకి జన్మించాడు.తెలుగు,ఉర్దూ,ఆంగ్ల,హిందీ భాషలలో మంచి ప్రావీణ్యం గల జయశంకర్ తెలంగాన ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆజన్మ బ్రమ్మచారిగా జీవించారు.వీరు విశ్వ బ్రామ్మన కులం లో జన్మించారు. బెనారస్ యూనివర్శిటీ నుండి ఆర్ధిక శాస్త్రం లో పట్ట పుచ్చుకున్న వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పి.హెచ్.డి పూర్తి చేసారు.1975 నుండి 1979 వరకు సి.కే.యం కాలేజీ ప్రిన్సిపల్ గా పనిచేశారు.1979 నుండి 91 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్టార్ గా,1991 నుండి 1994 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం ఉప కులపతి గా సేవలు అందించారు.పాటశాల దశ లోనే నాయకుడిగా ఎదిగిన వీరు ఇడ్లీ సాంబర్ గో బ్యాక్ అంటూ నినాదాలు చేసారు.1952 లో నాన్ ముల్కీ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించినారు.1954 లో విశాలాంధ్ర ప్రతిపాదనని ఎండగట్టిన ధీశాలి.1969 లో తెలంగాన తొలి దశ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించినారు.తరవాత 1995 మలి దశ ఉద్యమం లో మార్గ నిర్దేశకుడిగా,వెన్నెముక గా నిలిచారు. తెలంగాణలోని ప్రతి పల్లె ఆయన మాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి ఊధినది. ప్రతి పల్లె, పట్టణం తిరిగారు. ఊరూరా తెలంగాణ నినాదాన్ని విశ్వవ్యాప్తం చేశారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాల లో తెలంగాణ ఉద్యమ స్వరూపాన్ని వివరించారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని లెక్కలతో సహా ప్రజల ముందు ఉంచి తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను వివరించారు. "మా వనరులు మాకు ఉన్నాయి మా వనరులపై మాకు పూర్తి అధికారం కావాలి" అని నొక్కి వక్కాణించారు. యాచక దశ నుంచి శాసన దశకు తెలంగాణ రావాలె, మా తెలంగాణ రాష్ట్రం మాకు కావాలి అంటూ విన్నవించారు. తెలంగాణ లో అభివృద్ధి నత్త నడకన కొనసాగుతూ వుంది.నీళ్ల లో మన వాటా తేలిన తర్వాత జల వనరుల విశయం లో స్వేచ్ఛ వుంటూవుంది. స్వయం పాలనలో శ్వాసిస్థాం,ఇతరుల పాలనలో యాచిస్తూ వున్నాం.నిజాం నవాబు కాలంలో ఇక్కడ గొలుసు చెరువులే వుండేవి.కావాలని వానిని నాశనం చేసారు.తెలంగాన వస్తే ఈ చెరువులను పునరుద్దరించాలి అని పలు సమావేశాల్లో చెప్పినారు.2001 ఏప్రిల్ 27 న టి.ఆర్.యస్ పార్టీ ఏర్పాటు అయిన తర్వాత ఈ రాష్ట్ర ఏర్పాటుకు సరి అయిన నాయకుడిగా కే.సి.ఆర్ ను గుర్తించి పార్టీలకి అతీతంగా ముందుకు వెళ్ళాలని కోరిన వ్యక్తి జయశ%శీ%కర్ మాత్రమే.2009 నవంబరు 29 న కే.సి.ఆర్ ఆమరణ దీక్ష,2009 డిసెంబర్ 4 న శ్రీకాంత చారి ఆత్మాహుతి, ఈ ప్రాంత ప్రజలను కలచి వేసింది.ఉద్యమం వైపు పరుగులు పెట్టించింధి.2009 డిసెంబరు 9 న అప్పటి హెూం మంత్రి చిదంబరం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కు ప్రకటన చేయడం తర్వాత ఆంద్రా వారి ఒత్తిడులకు తలొగ్గి 2009 డిసెంబరు 23 న శాసన సభ తీర్మాణం ద్వార రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం చేస్తామని ప్రకటించారు.ఆ సమయం లో తెలంగాన లో ఆందోళనలు ప్రారంభం అయినాయి.ఈ విషయం లో జయశ%శీ%కర్ సర్ తీవ్ర స్థాయిలో మనస్తాపం చెంధినారు.పల్లె,పట్టణం ను ఉద్యమం వైపు మళ్లించి సామాజిక రాజీనామాలు,ఛలో అసంబ్లీ ఉద్యమ కార్యక్రమాలకు కేంద్ర బిందువు గా నిలిచారు.తెలంగాన మేధావులతో చర్చించి,కవులు,కళాకారులు,రచయితలు, ఉపాధ్యాయ ఉద్యోగులు,జర్నలిస్టులు,వివిధ పార్టీల ప్రతినిధులు,అన్ని కుల సంఘాలను ఏకం చేసి ఉద్యమాన్ని ముందుకి తీసుకు పోయారు.పుట్టుక నీది,చావు నీది,బ్రతుకు అంతా దేశానిధి అని చెప్పిన కాళోజీ మాటను నిజం చేసి బతుకు అంతా తెలంగాణాధి అని చెప్పినారు.మా తెలంగాన మాకు కావాలే,50 యెల్లుగా ఇదె మా ఆకాంక్ష.ఇదే శ్వాస,స్వప్నం,ఇదే జీవితం అని చెప్పిన మడమ తిప్పని యోధులు వీరు.తెలంగాన రాష్ట్రం రావాలి అప్పుడే నేను మరణిస్తా అని చెప్పిన త్యాగశీలి వీరు.అమరుల త్యాగాలు, బలిధానాలు, ఉద్యమ భావాలు గుర్తించి కేంద్ర ప్రభుత్వం 2014 మార్చి 4 న ఒక విడుదల చేసింది.జూన్ 2 ,2014 నుండి రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపుకోవాలని చెప్పడం జరిగింది. తర్వాత భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది తెలంగాణ తెలంగాణ రాష్ట్రానికి చూడకుండానే జయశంకర్ సార్ గొంతు క్యాన్సర్తో బాధపడుతూ 2011 జూన్ 21వ తేదీన కన్నుమూశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జయశంకర్ గారి సేవలను గుర్తించి ఆయన పేరు మీద జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ మరియు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఏర్పాటు చేసింది .విద్యారంగంలో ప్రతి ఏటా జూన్ నెలలో జరిగే బడి పండుగకు జయశంకర్ బడిబాట నామకరణం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు జయశంకర్ గారి పేరు పెట్టడం అభినందనీయం, ప్రశంసనీయం. వారి జన్మదినం ఆగస్టు ఆరవ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా వారి జయంతి నిర్వహించు కోవడం మన భాధ్యత.వారి సేవలను స్మరించుకుందాం.వారి కాంస్య విగ్రహాలని అన్ని జిల్లాల్లో,మండలాలలో ఏర్పాటు చేయాలి.జోహార్లు జయశంకర్ సర్,జోహార్లు .ప్రతీ ఒక్కరు వారి జీవిత చరిత్ర చదివి స్ఫూర్తిని పొంధుధాం.వారి ఉద్యమం అందరికి స్ఫూర్తి.



Professor. Kothapalli Jayashankar
Born: 6th August 1934. Died: 21st June 2011.
Parents: Lakshmikantha Rao, Mahalakshmi

కామిడి సతీష్ రెడ్డీ ,
ములుగు పల్లి ఉన్నత పాఠశాల.
జయశంకర్ భూపాలపల్లి జిల్లా..ఆగస్ట్ 6 న ప్రొఫెసర్ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సర్ జయంతి సందర్భంగా
.9848445134.

# ఈ నెల 7న, శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ పూజ కార్యక్రమాలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.



అమరచింత పట్టణంలో అతి పురాతనమైన దేవాలయం శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం గత మూడు వందల సంవత్సరాల క్రితం హజారీ వంశీకులచే వారి పూర్వికులు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం స్థాపితం చేయడం జరిగినది. పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం తో పాటు జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం లోని చింతరేవుల,ఇటిక్యాల మండలం కృష్ణ నదీ సమీపాన వెలసిన శ్రీ శ్రీ శ్రీ బీచుపల్లి ఆంజనేయ స్వామి విగ్రహాలను ఒకేరోజు స్థాపన చేయడం జరిగినట్లు పురాణ ఆనవాలు ఉన్నవి. అందులో భాగంగా నేడు వనపర్తి జిల్లా మక్తల్ నియోజక వర్గం లోని అమరచింత మండల కేంద్రం లో ఉన్నటువంటి శ్రీ శ్రీ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడం జరిగినది .ఇట్టి దేవాలయాన్ని పునర్నిర్మాణం కోసం గ్రామస్తులందరూ ఐక్యంగా ముందుకు వచ్చి పునర్నినర్మాణ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.అందులో భాగంగా ఈ నెల ఆగస్టు 7 వ తేదీ గురువారం రోజున శ్రీ శ్రీ ఆంజనేయ స్వామివారికి ఉదయం 5 గంటలకు అభిషేకము, ఆకు పూజా, వేద పండితుల మంత్రోచ్చారణ కార్యక్రమాలు జరుగుతాయి.పట్టణంలో ఉన్న ప్రతి ఒక్క హిందూ సోదర సోదరిమణులు దేవాలయం దగ్గరికి వచ్చి శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకోవాలని తెలిపారు.స్వామివారికి ప్రతి ఇంటి నుండి ఒక టెంకాయ,కుంకుమ, పసుపు అగరబత్తులు ,5 తమలపాకులు సమర్పించి స్వామి వారి ఆశీస్సులు పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని కోరారు.ఆ తరువాత స్వామి వారిని బాలాలయం చేయబడును.ఆలయ పునర్నిర్మాణ పూజ కార్యక్రమాలకి విచేయుచున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు తాటికొండ రమేష్.వెంకటేశ్వర రెడ్డి.ఎర్ర సత్యనారాయణ.శేఖర్ రెడ్డి.శివాజీ.వెంకట్ రెడ్డి.శ్రీనివాసులు. నర్సింలు. వగ్గు రమేష్ మంగ అనిల్.కొంగరీ కృష్ణమూర్తి తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి

## : చించోలి (బి) పల్లె దవాఖానను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 05.

సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామంలో ప్రభుత్వ పల్లె దవాఖాన ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ గది, మందుల నిల్వ గది, ఇంజెక్షన్ల గదిని పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యసేవలపై అధికారులతో సమీక్షించారు. ఆసుపత్రికి రోజూ వచ్చే రోగుల వివరాలు, మందుల వినియోగం, నిల్వలు, టీకాలు తదితర వివరాలన్నీ రిజిస్టర్లలో నమోదు చేయాలనీ అధికారులకు సూచించారు. వర్షాకాలంలో రోగుల సంఖ్య పెరగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన మందులను ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది పూర్తి అంకితభావంతో రోగులకు సేవలు అందించాలనీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా ప్రైవేటు స్థాయిలో వైద్యం అందుతోందన్న నమ్మకం ప్రజల్లో పెరగాలన్నారు. ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన రోగులతో స్వయంగా కలెక్టర్ మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న మందులు, ఇంజెక్షన్లు, సెలైన్‌లను పరిశీలించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సే ఉత్తమమని ప్రజలకు వివరించారు. ఆసుపత్రి పరిసరాల్లో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కలు నాటాలని, ప్రహరీ గోడ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో జిల్లా వైద్యాధికారి డా. రాజేందర్, తహసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్ రావు, వైద్యాధికారి సౌమ్యతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# టియుడబ్ల్యూజే జిల్లా పక్షాన ఆర్మూర్ సబ్ కలెక్టర్ కు స్వాగతం.. ఆర్డీవో కు వీడ్కోలు..

## టియుడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు పొన్నాల చంద్రశేఖర్.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రం పరిధిలో గల ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నూతనంగా బాధ్యతలు చేపట్టిన సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాళవీయ నీ టియుడబ్ల్యూజే, ఐజేయు జిల్లా ఉపాధ్యక్షులు పొన్నాల చంద్రశేఖర్ తో పాటు ఆర్మూర్ కు చెందిన జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు బొడమీది నరేష్, గట్టడి పవన్, వారి బృందం మర్యాద పూర్వకంగా కలిసి పూలమల శాలువాతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అంతకు ముందు ఆర్డిఓ గా విధులు నిర్వ హించిన రాజా గౌడ్ కి పూలమాల శాలువాతో వీడ్కోలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా జిల్లా టియుడబ్ల్యూజే,ఐజేయు ఉపాధ్యక్షులు పొన్నాల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గతంలో ఆర్డీవో రాజగౌడ్ విధులు అభినందనీయమని పేర్కొన్నారు. ఆర్మూర్ సబ్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అభిగ్యాన్ మాళవీయ కు జర్నలిస్టుల సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ జర్నలిస్టుల బృందం వారితో పాల్గొన్నారు.



# అయ్యప్ప ఆలయంలో పూజలు.. అన్నదానం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ పట్టణం అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం మాస పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, సుబ్రమణ్యస్వామి, అయ్యప్ప స్వామి దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు జరిపారు. దాతలు మాజీ సర్పంచ్ బూస సునీత, నరహరి, సాయికృష్ణ (చింటూ ) దివ్య అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చౌటి కిషన్, ఆలయ కమిటీ ప్రధాన పూజారి గణేష్ జోషి,ఆలయ కమిటీ సభ్యులు అంబటి నవీన్, మెడికల్ నరేందర్, తౌట్ గంగాధర్, లింగాగౌడ్, బలరాం సింగ్,ఎం. ఎస్ గౌడ్, బొట్ల రవీన్ ప్రసాద్, శ్యామ్, శ్రీకర్, సాయికుమార్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.



# వైన్స్ లో చోరీ కేసు..

## నిందితుడికి ఏడాది జైలు, జరిమానా

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలము కిసాన్ నగర్ గ్రామం తుల్జా భవాని వైన్స్ లో దొంగతనం కేసులో ఆర్మూర్ కోర్టు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి నెల్లి సరళ రాణి, నిందితుడు నక్క పోశెట్టి(61) కి ఒక సంవత్సరం జైలుశిక్షతో పాటు 2000/- రూపాయల జరిమానా విధించినట్లుగా ఎస్సై శైలేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం పకడ్బందీగా జరపాలి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. దీనిపై రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్లో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ, వివిధ అన్ని విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు, జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఈనెల 11న అల్బెండజోల్ మాత్రలు అందచేయాలని ఆదేశించారు. మేముజిల్లాలోని ఏ.ఎన్.ఎం.లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, వర్కర్ల ద్వారా స్కూల్, కాలేజీ, ఇంటింటికి వెళ్లి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలను వంద శాతం వేయాలని, మిస్ అయిన పిల్లలకు ఈనెల 18న మాప్ అప్ డే నాడు తప్పక అందించాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒకరి చొప్పున అంగన్వాడీ సూపర్వైజర్లు, సిడిపివోలు, మెప్మా సిబ్బంది పర్యవేక్షణ అధికారులుగా అవగాహన ర్యాలీలు, విధులు విజయవంతం చేయుటకు సిబ్బంది అందరూ భాగస్వామ్యులు కావాలని, ఈ మాత్రల వలన సైడ్ ఎఫెక్టులు ఏమి ఉండవువని ప్రజల్లో, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వైద్యాధికారి రజిత మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలను 19 సంవత్సరాల లోపు పిల్లలందరికి వేయాలని, గ్రామాల్లో పట్టణంలో ముందుగా చాటింపు చేయాలని సూచించారు. 1 నుండి 2 సంవత్సరాల లోపు పిల్లలందరికి సగమం మాత్రను పొడి చేసి నీటితో కలిపి ఇవ్వాలని, 2 నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఒక మాత్ర చొప్పున వేసి పూర్తిగా నమలమని చెప్పాలని, మాత్రలను ఇచ్చే సమయంలో త్రాగు నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. పెంచాలయ్య, డీఈవో వినోద్ కుమార్ డి.డబ్ల్యూ.ఓ, లక్ష్మి రాజం, డిపిఆర్ఓ, వి.శ్రీధర్, డి.పి.ఓ షరీఫ్దీన్ మున్సిపల్ కమిషనర్లు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలంటూ రైతులు ఆందోళన

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో మంగళవారం 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని రైతులు నిరసన తెలిపారు. కరెంట్ సరఫరా సక్రమంగా జరగక పంటలు నష్టపోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సబ్ ఇంజనీర్ మహేష్, పైఅధికారుల ప్రకారం త్రీఫేస్ విద్యుత్తు సరఫరా చేయగలమని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెంటు రాజేశ్వర్, ఎద్దండి నర్సయ్య, అంబటి సాయన్న, బొర్ర రాజేశ్వర్, గోవు చిన్నయ్య, ఇదన్ రావు పాల్గొన్నారు.




# కిసాన్ నగర్ లయన్స్ భవనంలో కంటి వైద్య శిబిరం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలం కిసాన్ నగర్ లోని లయన్స్ భవనంలో బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. మోతి బిందు ఉన్న వారిని గుర్తించి ఉచిత శస్త్ర చికిత్సల కోసం ఆర్మూర్ లయన్స్ కంటి ఆసుపత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి, కార్యదర్శి చాకు లింగం, బాల్కొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దినేష్ పటేల్, కోశాధికారి వంశీ రెడ్డి,పెండం జీవన్, సురేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



# నేత్రపర్వంగా జెండా బాలాజీ జాతర

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్మూర్ పట్టణం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం జెండా గల్లి, జెండా బాలాజీ జాతర నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి, దేవతామూర్తుల పూజలను వీక్షించి తరించారు. ఈ ప్రాంతం వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో వెలసిల్లాలని మొక్కుకున్నారు. ఆర్.ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్ కుటుంబ సభ్యులు దర్శించుకొని పూజలు చేసిన అనంతరం వారిని ఆలయ కమిటీ, సర్వ సమాజ్ అధ్యక్షులు కొటాల సుమన్ సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సంజయ్ సింగ్ బబ్లూ, అర్గుల్ సురేష్, నారాగౌడ్, రజనీష్ కిరాడ్, రామ్ ప్రసాద్, వితోభ శేఖర్, దోమల శ్రీనివాస్, ఉప్లూర్ వెంకట్, సునందా రెడ్డి, రఘు, సిద్ధార్థ రాయుడు, చిట్టెమ్మ ఉన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పిహెచ్ సి) పనులు పరిశీలన

## పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్

సమయజ్యోతి న్యూస్.... కృష్ణ నారాయణపేట జిల్లా



కృష్ణ మండల కేంద్రంలోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమిలో ఒక కోటి 56 లక్షల నిధులతో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. మైల్డ్ స్టోన్ ప్రకారం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆమె అన్నారు. ఆస్పత్రి భవన నిర్మాణ నమూనా ప్లాన్ కూడా ఆమె పరిశీలించారు. అదేవిధంగా మెడికల్ ఆఫీసర్ గది, స్టాప్ రూమ్, ఫార్మసీ, ఇమానేజేషన్ గదులను పరిశీలించారు. నిర్మాణ పనులను ఎప్పుడు పూర్తి అవుతాయో కలెక్టర్ అడిగిన ప్రశ్నకు సంబంధిత అధికారులు మరో మూడు నెలల్లో పనులు పూర్తయితాయని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం ప్రతిపాదనలో ఉన్నాయా లేదా అని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జింకల పార్క్ ఏర్పాటుకు మూడుమాల్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని అటవీ శాఖ అధికారులకు అప్పగించారా లేదా అని రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. వెంటనే భూమిని అప్పగించాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైను కలెక్టర్ ప్రణయ్ కుమార్, టిజిఎంఎస్ఐడిసి (ఈఈ)వేణుగోపాల్,డిఈ కృష్ణమూర్తి,తహసీల్దార్ శ్రీనివాస్,ఆర్ ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు వాస్తవాలు తెలియాలానే పవర్ పాయింట్ బీ ఆర్ ఎస్ నాయకులు

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం



తెలంగాణ భవన్ లో రాష్ట్ర మాజీ మంత్రి శ్రీ తన్నీరు హరీష్ రావు కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టేందుకు ప్రత్యేకంగా నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రత్యక్ష ప్రసారాన్ని మంగళవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వీక్షించారని బీ ఆర్ ఎస్ నాయకులు ఆదర్శ్ రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్ భూపాల్ రెడ్డి పాల్గొన్నారు పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు పటాన్చెరు మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్ సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి జిన్నారం మండల అధ్యక్షులు రాజేష్ బీఆర్ఎస్ వి యూత్ నాయకులు చిన్న మేరాజ్ ఖాన్ మాణిక్ యాదవ్ తెల్లాపూర్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ దేవేందర్ యాదవ్ శ్రీనివాస్ రెడ్డి శ్రీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారని తెలిపారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రాణ నాడిగా నిలిచిందని దీనిపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని ఖండించారని ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలనే లక్ష్యంతో హరీష్ రావు ప్రజెంటేషన్ చక్కటి అవగాహన కలిగించిందని బీ ఆర్ ఎస్ నాయకులు అభిప్రాయపడ్డారని ఆదర్శ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు

# స్మశానవాటిక కు రోడ్డు మంజూరు చేయాలి

## ఎంపీడీఓ కు వినతిపత్రం ఇచ్చిన గ్రామ యువకులు

సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా

మండలంలోని గుడెబల్లూర్ గ్రామంలోని స్మశాన వాటికకు నూతన రోడ్డును మంజూరు చేయాలని మండల ఎంపీడీవో విజయలక్ష్మి కి గ్రామ యువకులు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు.అనంతరం గ్రామ యువకులు మాట్లాడుతూ గ్రామం నుండి స్మశాన వాటికకు వెళ్ళడానికి చెరువు అలుగులో వెళ్లాల్సి ఉంది,అలాగే వర్షాకాలం చాలా మంది నీళ్లల్లో పడిపోయిన రోజులు ఉన్నాయని తెలిపారు.కాబ్బటి తిమ్మప్ప చెరువు నుండి ఊర చెరువు వరకు రోడ్డు ను మంజూరు చేయాలని గ్రామ యువకులు ఎంపీడీఓ విజయ లక్ష్మీ ను కోరారు.ఎంపీడీఓ విజయలక్ష్మి ఇరిగేషన్ అధికారి మరియు పంచాయితీ కార్యదర్శి, గ్రామాని సందర్శించి గ్రామంలో ని తిమ్మప్ప చెరువు నుండి ఊర చెరువు వరకు సర్వే చేసి తదనంతరం నాలా మరియు సి సి రోడ్డు నిర్మాణ పనుల కొరకు ఎస్టిమేట్ వేసి పై అధికారులకు పంపిస్తామని మండల అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ వాకిటి నారాయణ,మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి గ్రామ యువకులు పాల్గొన్నారు.



# సిఐటియు సంఘం నిజాలు తెలుసుకొని మాట్లాడితే మంచిది : ఏఐటియుసి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి

మందమర్రి ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ నాయకులు సేలంద్ర సత్యనారాయణ, భీమానాధుని సుదర్శన్, కంది శ్రీనివాస్ లు మాట్లాడుతూ ఏఐటీయూసీ గుర్తింపుని సీఐటీయూ జీర్ణించుకోలేక పోతుందని అన్నారు. గుర్తింపు కార్మిక సంఘంగా ఏఐటియుసి ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ పోతుంటే సీఐటీయూ కార్మిక సంఘం ఏఐటీయూసీ సంఘం పై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. సీఎన్ఎండి మొదటి స్ట్రక్చర్ కమిటీలలో సొంతింటి పథకం పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ ఒప్పించడం జరిగిందని కాకపోతే కమిటీ వేసి విధివిధానాలను పరిశీలిస్తామన్నారు ఈ మధ్యనే ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కొరిమి రాజ్ కుమార్ లు సీఎన్ఎండి ని కలిసి కమిటీ కాలయాపన జరుగుతుందని ఒప్పందంలో ఉన్న అంశాలను త్వరగా పరిష్కరించాలని కోరడం జరిగిందన్నారు. కమిటీ నిర్ణయం తుదిదశకు చేరుకుందని త్వరలో పరిష్కరించబడతాయని సీఎన్ఎండి చెప్పారు గతంలో ఏనాడు గనులపై మీ ముఖాలు కనబడలేదని గత10 సంవత్సరాలుగా లాభాల వాటా దసరా దీపావళికి ఇచ్చినప్పుడు మీ మొఖాలు ఎక్కడ పోయాయి 10 సంవత్సరాలుగా స్ట్రక్చర్ కమిటీలు వేయకపోతే అడగడం చేతగాని మీరు ఈరోజు ఏఐటీయూసీ ని ప్రశ్నిస్తున్నారా అని అన్నారు. సేఫ్టీ కమిటీలలో అనుభవిజ్ఞులు లేరని అందుకే ప్రమాదాలు జరుగుతున్నాయని మీరంటున్నారు ఈరోజు మేము యువతకు అవకాశాలు ఇచ్చాం అంతా చదువుకున్న విజ్ఞానులే కానీ మీరు యువత కమిటీలలో ఉండొద్దన్నట్లుగా యువతను కించపరిచేల అనుభవం లేదని మాట్లాడుతున్నారు. ఒకసారి గనుల పై వచ్చి తెలుసుకోండి కమిటీల పనితీరుని మొన్న జరిగిన మెడికల్ బోర్డులో మైనింగ్ స్టాఫ్



సోదరులకు సూటబుల్ జాబ్ ఇవ్వలేదు ఒప్పుకున్న సూటబుల్ జాబుని ఎందుకు ఇవ్వలేదో యాజమాన్యాన్ని నిలదీసి ఒప్పిస్తామని అన్నారు. ఏది చేసినా గుర్తింపు కార్మిక సంఘంగా మేమే చేస్తాం ప్రతిపక్ష సంఘాలుగా మీరు షోలు చేస్తారు పన్నులు ఏమీ చేయలేరు అని అన్నారు. మేము గుర్తింపు సంఘమైనా ప్రతిపక్ష సంఘమైన సమస్యలు పరిష్కరించబడు కుంటే పోరాటాలు చేస్తాం పోరాటాల ద్వారా సాధిస్తామన్నారు. ఇకనైనా నిజానిజాలు తెలుసుకో కుండా ఇష్టం వచ్చినట్లు ప్రకటనలు ఇచ్చి ఏఐటీయూసీ మీద బురద చల్లలని చూస్తే మీరు మీ సంఘం కార్మికులలో ఉనికి లేకుండా పోతారని అబద్ధపు ప్రకటనలు మానుకొని కార్మికుల సమస్యల పై పోరాడాలని ఏఐటీయూసీ సంఘం తెలియజేస్తుందని అన్నారు.

# దీపా మున్షీని కలిసిన ఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత సాధన కోసం ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన కార్యక్రమం అనంతరం, దీపా దాస్ మున్షీని ఎమ్మెల్యే బాలు నాయక్ తో ఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్చాన్ని అందజేశారు.



# తల్లిపాల వారోత్సవాలు.. తల్లులకు అవగాహన

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండలంలోని బోదేపల్లి గ్రామంలో మంగళవారం సిడిపిఓ అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు, స్త్రీలకు సామూహిక సీమంతాలు, శిశువులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ముర్రుపాల ప్రాముఖ్యత, తల్లిపాల ప్రాముఖ్యత, తల్లిపాలు 6 నెలల వరకు పట్టడం, రెండు సంవత్సరాల వరకు అదనపు ఆహారం ఇస్తూ తల్లిపాలు కొనసాగించాలని, థౌసంద్ డేస్ గోల్డెన్ డేస్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# సబ్ కలెక్టర్‌గా అభిజ్ఞాన్ మాలవ్య బాధ్యతల స్వీకరణ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్

ఆర్మూర్ సబ్ కలెక్టర్‌గా మంగళవారం అభిజ్ఞాన్ మాలవ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రభుత్వ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



# ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మరొకరు బలి

## అప్పులు చేసి తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్,ఆగస్ట్5(సమయజ్యోతి):

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బెట్టింగ్ గేమ్స్ ఆడకుండా ఉండలేక.. అప్పులు తీర్చలేక ప్రాణాలను తీసుకుంటున్నట్లు మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నరేశ్.. భార్య కీర్తి, కుమార్తె భవ్యతో కలిసి వనస్థలిపురంలోని ఓ కాలనీలో నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై ఆర్థికంగా నష్టపోయిన నరేశ్.. సుమారు రూ.15లక్షలు అప్పు చేసినట్లు- సమాచారం. ఇటీవల అనారోగ్యంతో ఇంట్లో ఉంటున్న నరేశ్.. అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# రామచంద్రారెడ్డి నగర్ సమస్యకు శాశ్వత పరిష్కారం కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

రామచంద్రారెడ్డి నగర్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించినట్లు కార్పొరేటర్ పుష్పానగేష్ తెలిపారు గత కొన్ని సంవత్సరాలుగా తేలికపాటి వర్షానికే రామచంద్రారెడ్డి నగర్ కాలనీ లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇంకా ఇబ్బంది పడుతున్నారని తెలిసి శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు అందులకై జిహెచ్ఎంసి జోనల్ కమీషనర్ ను కలిసి ఓపెన్ డ్రైన్ కట్టడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని గతంలోనే కోరినట్లు తెలిపారు సుమారు రు 23.00 లక్షల నిధులు ఓపెన్ డ్రైన్ కై మంజూరు చేయించినట్లు తెలిపారు ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి మంగళవారం రామచంద్రారెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు జగన్నాథ్ రెడ్డి జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ ఈఈ సురేష్ ఏఈ దివ్య తో కలిసి కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేసి పనులను ప్రారంభించినట్లు స్థానిక రామచంద్రాపురం కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ తెలిపారు వారితో చంద్రశేఖర్ గుప్తా తిరుమల్ గౌడ్ శశికళ యాదవ రెడ్డి వీర రెడ్డి వాసుదేవ్ మాధవ రెడ్డి రాజశేఖర్ యాదయ్య సిఎం మల్లేష్ వెంకట్ రెడ్డి విఠల్ రెడ్డి భుజంగ రెడ్డి నిరంజన్ రెడ్డి సహదేవ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు



# పిఎం మత్స్య సంపద యోజన పథకం పై అవగాహన

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 05.

జిల్లాలో మత్స్యకారుల ఆదాయం పెంచే లక్ష్యంతో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనకాపూర్, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. కిసాన్ క్రెడిట్ కార్డులు, మత్స్యకార సంఘాలకు చెరువుల అభివృద్ధికి రుణాలు, మహిళల ఎస్ హెచ్ జి లకు మత్స్య వ్యవసాయానికి ఆర్థిక సాయం. వెసెల్స్, వలలు, ట్రాలర్ల కోసం బ్యాంకు రుణాలు తదితర అంశాలపై ఎల్ డి ఎం అవగాహన కల్పించారు. ప్రైవేట్ వడ్డీదారుల వద్దకు వెళ్లకుండా బ్యాంకుల నుండి రుణాలు పొందాలని ఆయన కోరారు.



# మెగా జాబ్ మేళాలో యువతీ,యువకులకు పెద్ద సంఖ్యలో అవకాశాలు.

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

## 296 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :

జిల్లా కేంద్రంలోని ఎస్ టీ యు భవన్ లో మంగళవారం నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతంగా ముగిసింది.ఈ జాబ్ మేళాలో మొత్తం 3,580 మంది అభ్యర్థులు హాజరయ్యారు.వీరిలో 396 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్టు అయ్యారు కాగా,296 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమం తెలంగాణ ప్రభుత్వ టాస్క్ స్టేట్ ఆర్గనైజేషన్,జిల్లా ఉపాధికల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడింది.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ,ఈ జాబ్ మేళా ద్వారా పెద్ద సంఖ్యలో యువతికి,యువకులకు ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు.జాబ్ మేళా ప్రారంభోత్సవ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా,అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జ్యోతి ప్రజ్వలన గావించి జాబ్ మేళా ను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఐటీ, నాన్ – ఐటీ సహా 34 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. ఎస్ఎస్సి నుండి పీజీ వరకు విద్యార్హత కలిగిన అభ్యర్థుల కోసం టెక్నికల్,నాన్ టెక్నికల్ రంగాలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడ్డాయి.కంపెనీలు అభ్యర్థుల తగిన వెరిఫికేషన్ అనంతరం అర్హులను ఎంపిక చేశాయి.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,“ఇదే తరహాలో మరిన్ని అవకాశాలను జిల్లాలో యువతకు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి,ఉపాధికల్పన అధికారి మిల్కా,మున్సిపల్ కమిషనర్ సీవీయన్ రాజు,ఇంటర్మీడియెట్ అధికారి గణేష్,ఉద్యోగాన్వేషక యువత తదితరులు పాల్గొన్నారు.



# బీహార్ ఓటు సవరణపై నిరసనలు

## పార్లమెంట్ ముందు

## ఇండియా కూటమి ఆందోళన

**న్యూఢిల్లీ,ఆగస్టు5 (సమయజ్యోతి):**

బీహార్‌లో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పలువురు ఇండియా బ్లాక్ నేతలు పార్లమెంటులో నిరసన చేపట్టారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరుసగా పదవరోజైన మంగళవారం కూడా ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. పార్లమెంట్ మకరద్వారం సమీపంలో చేపట్టిన నిరసనలో వామపక్షాలు, డిఎంకె, టిఎంసి ఎంపిలు సహా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలు పాల్గొన్నారు. 'మన ఓటు-. మన హక్కు. మన పోరాటం', 'ఎస్ఐఆర్- సైలెంట్ ఇన్విజబుల్ రిగ్గింగ్' అని రాసి వున్న బ్యానర్లు ప్రదర్శించారు. 'స్టాప్ ఎస్ఐఆర్' ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శించడంతో పాటు- పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఓటర్ల ఓటు- హక్కును తొలగించడం లక్ష్యంగా ఇసిఐ కసరత్తు చేపడుతోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలంటూ పార్లమెంట్ ఉభయ స భల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మరణించడంతో సోమవారం ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టలేదు.

# కాశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూత

**న్యూఢిల్లీ,ఆగస్టు5 (సమయజ్యోతి):**

జమ్మూకశ్మీర్ (మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందినట్లు- సన్నిహిత వర్గాలు పేర్కొన్నాయి. ఇటీవల ఆయన నివాసాల్లో సోదాలు జరిపి, సీబీఐ ఛార్జ్‌షీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అస్వస్థతకు గురైన సత్యపాల్ మాలిక్ ఆస్పత్రిలో చేరినట్లు తెలుస్తోంది. ఆగస్టు 23, 2018 నుంచి అక్టోబర్ 30, 2019 వరకు జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా సత్యపాల్ మాలిక్ పనిచేశారు. ఆ సమయంలో ఓ పవర్ ప్రాజెక్ట్ టెండర్ల పక్రియలో అవినీతి జరిగిందని ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ కేసులో మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్‌పై సీబీఐ ఛార్జిషీటు దాఖలు చేసింది. ఈ కేసులో తాజాగా ఆయన నివాసాల్లో సోదాలు జరిపిన సీబీఐ.. ఆయనతోపాటు మరో ఐదుగురి పేర్లను ఛార్జిషీటులో పేర్కొంది. దీనిపై 'ఎక్స్' వేదికగా స్పందించిన ఆయన.. ప్రస్తుతం తాను ఆసుపత్రిలో ఉన్నానని, ఎవరితో మాట్లాడే పరిస్థితిలో లేనన్నారు. అనేకమంది శ్రేయోభిలాషుల నుంచి ఫోన్లు వస్తున్నాయని, వాళ్లతో మాట్లాడలేకపోతున్నానని పేర్కొన్నారు.



# బిజెపి వైపు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల చూపు

## త్వరలోనే పార్టీలో చేరుతారని ప్రచారం

**హైదరాబాద్,ఆగస్ట్5(సమయజ్యోతి):**

కాళేశ్వరం కమిషన్ రిపోర్టుతో ఉక్కిరిబిక్కిరవుతున్న గులాబీ పార్టీకి మరో సంక్షోభం వచ్చి పడింది. ఆ పార్టీకి చెందిన పది మంది మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు రెడీ అవుతున్నారు. వీరిలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నట్టు- సంకేతాలు కూడా ఇచ్చారు. అయితే ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో చిక్కిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావు, పైలట్ రోహిత్ రెడ్డి కూడా పార్టీలో బీజేపీలో చేరబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. అదే విధంగా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కీలక నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్టు- సమాచారం. ఈ నెల 9న నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఢిల్లీలో బీజేపీ కీలక నేతల బీఎల్ సంతోష్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకొనేందుకు రెడీ అయిపోయారని సమాచారం. వీరిలో నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఇద్దరు ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే ఉన్నట్టు- తెలుస్తోంది. రెండో దఫాలో మరో ఆరుగురు బీజేపీలో చేరుతారని సమాచారం.అయితే బీజేపీతో ఇప్పటికే చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో పాల్గొన్న నేతలంతా బీఎల్ సంతోష్‌తో మంతనాలు సాగించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మరో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మరో మాజీ ఎమ్మెల్యేతో పాటు- మరో ఇద్దరు కీలక నేతలు కారు దిగుతారని సమాచారం.

# గువ్వలా ఎగిరిపోతున్న బాలరాజు

## కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్లు-చర్చ

**మహబూబ్‌నగర్,ఆగస్టు5 (సమయజ్యోతి):**

ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేయడం వెనక ఏమై ఉంటుందా అని అంతా చర్చిస్తున్నారు. ఇప్పుడే బిఆర్ఎస్‌కు రాజీనామా చేయడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదు. అయితే ఆయన అధికార కాంగ్రెస్‌లోకి వెళతారన్న ప్రచారం కూడా ఉంది. ఇకపోతే బీఆర్ఎస్ పార్టీపై అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు షాకింగ్ కామెంట్స్ చేశారు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత చెప్పినట్లుగానే పరిణామాలు ఉంటున్నాయని అన్నారు. బీఆర్ఎస్‌లో పరిణామాలు చూస్తుంటే పొత్తు పెట్టు- కున్నా ఆశ్చర్యం లేదని ఆక్షేపించారు. బీఆర్ఎస్, బీజేపీ వ్యవహారంపై ఎమ్మెల్సీ కవిత లాంటి నేతలు కూడా చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో తనకు భవిష్యత్తు లేదనే అసంతృప్తితోనే రాజీనామా చేశానని చెప్పుకొచ్చారు. మంగళవారం గువ్వల బాలరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నేతలు తనకు టచ్‌లోకి వచ్చిన మాట వాస్తవమని గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. అచ్చంపేట నియోజకవర్గం ప్రజల అభిప్రాయం మేరకు ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకుంటా నని తెలిపారు. బీఎల్ సంతోష్‌ను తాను ఎప్పుడూ విమర్శించ లేదని చెప్పుకొచ్చారు. అప్పట్లో బీఎల్ సంతోష్ ఎవరో కూడా తనకు తెలియదని గువ్వల బాలరాజు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన టాస్క్‌ను మాత్రమే తాను పూర్తి చేశానని క్లారిటీ- ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకత్వం.. ప్రజల్లో బలం లేని రెడీమేడ్ లీడర్స్‌ను నమ్ముకుంటుందని వ్యాఖ్యానించారు. జనరల్ నియోజక వర్గాల్లో దళితులకు సీట్లు ఇచ్చే దమ్ము బీఆర్ఎస్‌కు ఉందా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఏడాదిన్నర కాలంగా బీఆర్ఎస్‌లో తనకు ప్రాధాన్యం తగ్గించారని గువ్వల బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గువ్వల బాలరాజు బీఆర్ఎస్ కార్యకర్తతో మాట్లాడినట్లుగా ఓ ఫోన్ కాల్ వైరల్ అవుతోంది. ఈ ఫోన్ కాల్‌లో ఏం మాట్లాడరంటే.. 'బీజేపీతో



బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందని లేదా విలీనం అవుతుందనే వార్తలు వస్తున్నాయి. అలాంటప్పుడు మన అభ్యర్థిత్వం ఎగిరిపోతుంది. గతంలో బీజేపీతో నేను పోరాటం చేశా. బీఆర్ఎస్ కంటే ముందే నా దారి నేను చూసుకుని.. బీజేపీలో కలవడం మంచిదని నిర్ణయం తీసుకున్నా. పార్టీలో నన్ను కాదని నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఇచ్చారు. ఆ విషయం ఎంతో బాధించిందని గువ్వల బాలరాజు మాట్లాడుతు న్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనినిబట్టి ఆయన కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని అంటున్నారు. ఇకపోతే జిల్లాకు చెందిన సిఎంగా రేవంత్ ఉండడంతో ఆయన అటువైపు మొగ్గు చూపుతున్నారని కూడా ప్రచారం. మొత్తంగా ఎటు వెళ్లినా ఇప్పటికిప్పుడు గువ్వలకు వచ్చే ఉపయోగం ఏమీ ఉండకపోవ్చు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

## తీర్మానాన్ని ఆమోదించిన రాజ్యసభ

**న్యూఢిల్లీ,ఆగస్టు 5(సమయజ్యోతి):**

ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఉదయం, ప్రతిపక్షాల తీవ్ర నినాదాల మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని ఎగువ సభలో ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు కింద అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద అమలులోకి వచ్చే ఈ నిర్ణయం ప్రకారం.. రాష్ట్రపతి పాలన పొడగించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన భారత గెజిట్‌లో ప్రచురించబడిన ఈ ప్రకటన, మణిపూర్ శాసనసభ అధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపి వేస్తుందని పేర్కొంది. ఈ ఉత్తర్వు ప్రకారం, గవర్నర్ అధికారాలను ఇప్పుడు రాష్ట్రపతి ఉపయోగిస్తారు. రాష్ట్ర శాసనసభ అధికారాన్ని పార్లమెంటు- స్వీకరిస్తుంది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయలేనప్పుడు సాధారణంగా రాష్ట్రపతి పాలన విధిస్తారు. రాష్ట్రపతి పాలన విధించడం పార్లమెంటరీ ఆమోదానికి లోబడి ఆరు నెలల వరకు ఉంటుంది. ఈ కాలంలో, కేంద్ర ప్రభుత్వం పాలనను పర్యవేక్షిస్తుంది. కొత్త అసెంబ్లీని ఎన్నుకోవడానికి కొత్తగా ఎన్నికలు జరగవచ్చు. మణిపూర్‌లో జరిగిన అశాంతిలో ప్రధానంగా మెజారిటీ- మెయిటీ- కమ్యూనిటీ-, మైనారిటీ- కుకి-జోమి తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ కోటాలు ఇంకా భూమి హక్కులకు సంబంధించిన వివాదాలపై ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ హింస వందలాది మంది మరణానికి దారితీసింది. సుమారు 60,000 మంది నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో అక్కడ శాంతిభద్రతలను కాపాడేందుకు కేంద్రం రాష్ట్రపతి పాలనకు మొగ్గుచూపింది.

# పత్రికలు సమాజానికి దర్పణం లాంటివి

## మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి

## 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణలో వెంకయ్యనాయుడు

**హైదరాబాద్,ఆగస్టు 5(సమయజ్యోతి):**

పత్రికలు సమాజానికి దర్పణం లాంటివని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని అవినీతిని ప్రజలకు జర్నలిస్టులు వివరించాలి. నిజాన్ని తెలియజేసి తీర్పును ప్రజలకే వదిలేయాలి. మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి. గతంలో బూతులు మాట్లాడిన నేతలు ఎవరూ గెలవలేదు. అలాంటి వారిని నిలువరించాలని ఓ మహిళ నాతో అన్నారు. పోలింగ్‌బూత్‌ల ద్వారా బూతు నేతల నోరు మూయించాలని ఆమెకు చెప్పానని వెంకయ్యనాయుడు అన్నారు. భాష విషయంలో నాయకుల తీరు మారాలని వెంకయ్యనాయుడు సూచించారు. సీనియర్ సంపాదకులు ఐ.వెంకట్రావు రాసిన విలీనం-విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మీడియాతో మాట్లాడారు. విలీనం - విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకాన్ని నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. పత్రికా సమాజానికి దర్పణం లాంటిదని... ఈ సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు. మనం వ్యూస్ కోసం న్యూస్ చేయకూడదని.. దానికోసమే కాలమ్స్ ఉన్నాయని, రాసుకోవడానికి అందులో వాళ్ల అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. భాష విషయంలో రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. చాలా మంది జర్నలిస్టులు కొత్తగా యూట్యూబ్‌లో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని.. పాత్రికేయంలో భాష చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు వెంకయ్యనాయుడు. తన జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని గుర్తుచేసుకున్నారు. ఒకటి తన అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు... తాను తన అమ్మను చూడలేదని భావోద్వేగానికి గురయ్యారు. రెండోది పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి తనను ఉప రాష్ట్రపతిగా చేసినప్పుడు...తనకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదని తెలిపారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు తాను బీజేపీ ఆఫీస్‌కు పోలేదని వెల్లడించారు. తాను ఉప రాష్ట్రపతిగా దిగిపోయిన నాటి నుంచి ఇప్పటి వరకు బీజేపీ ఆఫీస్ గుమ్మం తొక్కలేదని చెప్పుకొచ్చారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# ఇవిఎంలపై విశ్వసనీయత పోయింది

## బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరపండి

## బీహారాతో దీనిని ప్రారంభించండి

## కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీలో బిఆర్ఎస్ డిమాండ్

**న్యూఢిల్లీ,ఆగస్ట్5(సమయజ్యోతి):**

భారతదేశంలో ఇకపైన జరిగే ప్రతి ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరగాలని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు . బ్యాలెట్ విధానాన్ని బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేటీఆర్ కోరారు. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు బిఆర్ఎస్ నేతల బృందం కేటీఆర్ నేతృత్వంలో ఈసీ అధికారులతో సమావేశం అయింది. దేశంలో ఎన్నికల వ్యవస్థ, నూతన సంస్కరణలు, ఎన్నికల నియమావళి వంటి అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగానే టిఆర్ఎస్ పార్టీని సమావేశానికి ఆహ్వానించింది. కేంద్ర ఎన్నికల సంఘంతో జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ బృందం పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేసింది.. భారత్ లో ఈవీఎంల ద్వారా జరుగుతున్న ఎన్నికల పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో, ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. నవంబర్ లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు- కేటీ-ఆర్ తెలిపారు. అంతేకాదు ఎన్నికలు వస్తే చాలు రాజకీయ పార్టీలు అడ్డగోలు వాగ్దానాలు చేస్తున్నాయని, వాటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోతే చర్యలు కూడా తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని బిఆర్ఎస్ కోరింది. మరోపక్క బీహార్ లో జరిగిన ఓట్ల జాబితా సమగ్ర సర్వేపై కూడా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించినట్టు- తెలిపారు. ముఖ్యంగా ఓట్లు- తొలగించేటటువంటి పక్రియను బూత్ స్థాయి నుంచి అన్ని రాజకీయ పార్టీలను అఖిలపక్షంగా ఏర్పాటు- చేసి పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అనర్హుడికి ఒక ఓటు- వచ్చినా సరే, ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు- కోల్పో వద్దన్నారు కేటీ-ఆర్. ఎన్నికల గుర్తులు నుంచి తమ పార్టీ సింబల్ అయిన కార్ గుర్తును పోలి ఉన్న గుర్తులను తక్షణమే తొలగించాలని.. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో పోలివున్న గుర్తులవల్ల తమ పార్టీ అభ్యర్థులు నష్టపోయారని కేటీఆర్ గుర్తు చేశారు..



# ఘనంగా కంది శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు వేడుకలు

## కాంగ్రెస్ శ్రేణులు,అభిమానులతో సందడిగా ప్రజాసేవాభవన్‌లి

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

తాను నిత్యం ప్రజల మధ్యనే ఉంటానని జనం ఆశీస్సులతోనే ఇంతటి అభిమానాన్ని పొందగలిగాగని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.మంగళవారం తన పుట్టిన రోజును పురస్కరించుకుని నియోజకవర్గ నలుమూలలనుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు అభిమానులు మిత్రులు శ్రేయోభిలాషుల మధ్య ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాసేవాభవన్ లో జరిగిన జన్మదిన వేడుకలలో ఆయన తన సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి సమేతంగా పాల్గొని అందరి శుభాకాంక్షల వెల్లువల మధ్య 40 కిలోల భారీ కేక్ కట్ చేసారు.అంతకు ముందు అభిమానులు క్యాంపు కార్యాలయ ఆవరణలో కంది శ్రీనివాస రెడ్డి దంపతులను భారీ గజమాలతో సత్కరించారు.అశేషంగా తరలివచ్చిన శ్రేణులు పూలబొకేలు,శాలువాలతో తమ అభిమాన నేత కంది శ్రీనివాస రెడ్డి దంపతులను సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.తన పుట్టిన రోజుకు తనపై అభిమానంతో ఇంత పెద్ద సంఖ్యలో తరలివచ్చిన పార్టీ శ్రేణులకు,అభిమానులకు కంది శ్రీనివాస రెడ్డి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.తన జన్మదినాన్ని సేవాదినంగా పాటించి పట్టణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు తెలిపారు.ఆదిలాబాద్ నియోజక వర్గ ప్రజల ఆశీస్సులతో ఇంత మంది ప్రజల అభిమానాన్ని సంపాదించడం తనకు ఎనలేని సంతోషాన్ని కలిగిస్తుందన్నారు.నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు.తాను ఓడినా,గెలిచినా ప్రజల మనిషినే అన్నారు.నియోజక వర్గ ప్రజలకు ఎవరికి ఎలాంటి అవసరమొచ్చిన నిత్యం అందుబాటులో ఉంటానన్నారు.మనమంతా ఓ కుటుంబంలా కలిసి మెలిసి,అనుకున్న లక్ష్యాలను చేరుకుందామన్నారు.నాయకులు,కార్యకర్తలను కంటికిరెప్పలా కాపాడుకుంటానని తెలిపారు.ఇదే ఉత్సాహంతో రానున్న స్థానిక ఎన్నికలలో అంతా కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామన్నారు.తాను ఎల్లప్పుడూ మీ మనిషినే అని గుర్తు పెట్టుకోవాలన్నారు.ఎల్లకాలం ఇలాంటి ఆశీర్వాదం తనపై ఉండాలని



కోరుకుంటున్నానన్నారు.అనంతరం ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి రక్తదాతలను అభినందించి వారికి ఫౌండేషన్ తరపున ప్రశంసా పత్రాలు అందచేసారు.అనంతరం రిమ్స్ ఆవరణలోని గణేష్ మందిరాన్ని కంది శ్రీనివాస రెడ్డి దంపతులు దర్శించి ప్రత్యేక పూజలు చేసారు.రిమ్స్ సత్యసాయి నిత్యాన్నదాన కేంద్రంలో ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని అన్నదానం నిర్వహించారు.న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలో గల మదర్సాలో ఆయన అభిమానులు చేపట్టిన అన్నదానకేంద్రాన్ని సందర్శించారు.మదర్సా కు కావలసిన తోడ్పాటు అందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జిల్లా నూతన డీఈవోగా చార్జి తీసుకున్న కుషబుగుప్తా ఐఏఎస్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ జిల్లా నూతన విద్యాశాఖ అధికారి (డిఈఓ) గా మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టిన కుష్బూ గుప్తా ఐఏఎస్.ఆదిలాబాద్ జిల్లాలో అడిషనల్ కలెక్టర్ గా పనిచేసిన అనంతరం ఉట్నూర్ లో ఐటీడీఏ పీవో గా పని చేశారు.మళ్లీ ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా జిల్లాకి నూతన విద్యాశాఖ అధికారిగా పదవి బాధ్యతలను చేపట్టారు.



# సంస్థ అభివృద్ధికి సహకారమందిస్తా. - కంది శ్రీనివాస రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం పలుచోట్ల అన్నదానాలు నిర్వహించారు.న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలోని మదర్సాలో ఆయన అభిమానులు చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన తన సతీమణి తో కలిసి సందర్శించారు.మదర్సా అభివృద్ధి కోసం ఎప్పుడు ఎలాంటి సహకారం కావాలన్న తాను అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.



# వన్యప్రాణులను సంహరించే వారిపట్ల కఠిన చర్యలు - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

## వన్యప్రాణుల వేటగాళ్లపై నాలుగు కేసులు నమోదు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

జిల్లాలో వన్యప్రాణులను సంహరించడంతో ముఠాల ఆట కట్టించాలని ఉద్దేశంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా వ్యాప్తంగా వన్యప్రాణులను సంహరించే వారిని పట్టుకోవడానికి పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించగా,ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో ఒకరూ,మావల పరిధిలో ఇద్దరు,తాంసి పరిధిలో ఒకరిపై కేసు నమోదు చేసి వారి వద్ద వన్యప్రాణులను సంహరించే ఆయుధాలు సామాగ్రి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు.ముఖ్యంగా వన్యప్రాణులను ప్రతి ఒక్కరు సంరక్షిస్తూ ఉండాలని,వాటిని చంపడం,వేటాడడం చట్టరీత్యా నేరమని,వేటాడినా చంపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వన్యప్రాణులను సంహరించే వేటగాళ్లపై నాలుగు కేసులు నమోదైనట్టు మంగళవారం జిల్లా ఎస్పీ నిందుతుల వివరాలను వివరించారు. 1)షోయబ్ అఫ్జల్ తండ్రి అబ్దుల్ అజీజ్,నివాసం పంజేష,(ఆదిలాబాద్ వన్ టౌన్).,2) షేక్ షరీఫ్ తండ్రి లతీఫ్,నివాసం గోట్కూరి,(తాంసి).,3) ఆత్రం మారుతి తండ్రి దేవ్ రావు,నివాసం వాగాపూర్,(మావల).,4) ఆత్రం భీమ్రావు తండ్రి దేవ్ రావు,నివాసం వాగాపూర్,(మావల). ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన నిందితుని వద్ద లభించిన వాటి వివరాలు తెలుపుతూ ఒక డబుల్ బోర్ గన్,ఒక కొమ్ములతో కూడిన జింక తల,రెండు జింక కొమ్ముల ముక్కలు,వేటకు ఉపయోగించే సామాగ్రి,టార్గెట్ పేపర్స్,కత్తులు,టార్చ్ లైట్ మఫ్లర్,జాకెట్స్,షూస్,బ్యాగ్స్. మావల పరిధిలో నమోదైన ఆత్రం భీమ్రావు వద్ద లభించిన వాటి వివరాలు తెలియజేస్తూ 50 మీటర్ల జె వైరు,నైలాన్ మెష్ 50 మీటర్లది,జంతువులను వేటాడే పట్టుకునే సామాగ్రి,ఒక ఈటే,ఎలక్ట్రిక్ వైరు. అత్రం మారుతి వద్ద లభించిన వాటి వివరాల్లో 60 మీటర్ల జే వైరు,జంతువులను వేటాడే సామాగ్రి,ఎలక్ట్రిక్ వైరు,జంతువులను చంపడానికి ఉపయోగించే ఒక ఈటె. తాంసి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఒక ఎయిర్ గన్ లభించినట్లు తెలిపారు.ఈ నలుగురిపై ఆయా పోలీస్



స్టేషన్లో పరిధిలో కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలియజేశారు.వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని గుర్తు చేశారు.జిల్లా వ్యాప్తంగా ఎలాంటి ఆసాంఘిక కార్యకలాపాలు జరిగిన డయల్ 100 లేదా 8712659973 నెంబర్ కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని తెలిపారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.ఈ నేరస్థులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన వన్ టౌన్,మావల,తాంసి పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ యల్ జీవన్ రెడ్డి,వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బి సునీల్ కుమార్,మావల సీఐ కర్రె స్వామి,ఎస్సై ఇసాక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణి.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, టిపీసీసీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఎస్. శ్యామ్, పి. విష్ణు, దేవరకొండ మోహన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరేష్ గౌడ్,మాలే గౌడ్ల రాకేష్ గౌడ్, హరీష్ నాయక్, జె. ప్రకాశం, హన్మంత్ నాయక్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడ కోరుట్ల రోడ్డుకు బీటి రోడ్డు మరమ్మత్తు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

వేములవాడ కోరుట్ల రోడ్డు లో మరమ్మత్తుకు గురైన 600 మీటర్ల మేర రోడ్డును ప్రభుత్వ విప్, కలెక్టర్ ఆదేశాల మేరకు గుంతల రోడ్డు తొలగించి మళ్ళీ నూతన బీటి రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వేములవాడ కోరుట్ల రోడ్డు మరమ్మత్తు వల్ల ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు స్పందించిన ఆర్ అండ్ బి శాఖ అధికారులు చెక్కపల్లి చౌరస్తా (0/4) నుంచి కోరుట్ల బస్సు స్టాప్ (1/0) 600 మీటర్ల రోడ్డు గుంతలను పూర్తిగా తొలగించి బీటీ రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారు.



# టిబి ముక్ భారత్ కార్యక్రేమం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

మెండోరా మండలము దూద్గం, ముప్కాల్ గ్రామాల్లో మంగళవారం వైద్యాధికారి మద్దుల రాకేష్ ఆధ్వర్యంలో టీవీ ముక్త్ భారత్ కార్యక్రమం ద్వారా రోగులకు పరీక్షలు జరిపి, పోషన్ అభియాన్ కిట్లు అందజేశారు. ఎస్ యుఓ మురళి, సూపర్వైజర్ వనమాల, కార్యదర్శి భారత్, ఏఎన్ఎం ఎస్తేర్,అరుణ్ రజిత నసిమా, ఆశా నజియా పాల్గొన్నారు.



# ఆగస్టులో పెరగనున్న యూరియా వినియోగం

## మరో 3 లక్షల మెట్రిక్ టన్నులయూరియా అవసరం

## తక్షణం విడుదల చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్,ఆగస్ట్5(సమయజ్యోతి):

రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దానిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయాలని కేంద్రానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ నెలలో ధాన్యం, పత్తి, మక్క వంటి పంటలకు యూరియాను పైపాటు-గా వాడుతారని, ఇలాంటి పరిస్థితులలో యూరియా సరఫరాలో ఎలాంటి ఆలస్యం తలెత్తిన పంటల దిగుబడులపై తీవ్రమైన ప్రభావం పడే అవకాశముందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే, ఆగస్టు నెలలో పంటల అత్యధిక యూరియా వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా వేయడం జరిగిందని అన్నారు. గత ఏప్రిల్ 1వ తేదీ నుండి జూలై 31వ తేదీ వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగిందన్నారు. ఇదే సమయంలో ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు విక్రయించడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించి, అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతిగా రావాల్సిన యూరియాకు సంబంధించి షిప్ మెంట్ వివరాలు ఇంకా రాలేదని మంత్రి అన్నారు. అంతేకాకుండా దేశీయ సంస్థల నుండి 11,000 మెట్రిక్ టన్నులు, ఇతరత్రా 7,000 మెట్రిక్ టన్నులు ఆగస్టులో ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, వారు సరఫరా చేయలేమని తెలియజేసినట్టు- పేర్కొన్నారు. ఎప్రిల్ నుండి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నులు కొరత ఏర్పడిందని, ఈ విషయంలో కేంద్ర



రసాయనాలు, ఎరువులు శాఖ మంత్రి జెపి నడ్డా తక్షణ చర్యలు తీసుకోవాలని లేఖ ద్వారా కోరారు. అదేవిధంగా ఈ ఆగస్టులో సరఫరా చేయలేమని చెప్పినందువల్ల ఏర్పడిన 18,000 మెట్రిక్ టన్నుల కొరతను భర్తీ చేయాలని అన్నారు. ఆగస్టు నెలలో కేటాయించిన విధంగా రాష్ట్రానికి దిగుమతి ద్వారా అందాల్సిన 39,600 మెట్రిక్ టన్నుల యూరియాను ఈ నెల 20వ తేదీకి ముందు రాష్ట్రానికి చేరే నౌకల ద్వారా ఇవ్వాలని అన్నారు. దాంతో పాటు- ఏప్రిల్ నుండి జూలై మధ్య ఏర్పడిన 2.10 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరతను కూడా ఆగస్టు నెలలో మంజూరు చేయాలని లేఖ ద్వారా అభ్యర్థించారు. రాష్ట్రంలో ప్రస్తుతం సాగు అవుతున్న పంటలకు యూరియా లభ్యత నిరవధికంగా ఉండేలా చూసేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# మరుభూమిని తలపిస్తున్న ధరాలి గ్రామం

## సహాయక చర్యలకు రంగంలోకి దిగిన ఆర్మీ

డెహ్రాడూన్,ఆగస్ట్5(సమయజ్యోతి):

ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో మెరుపు వరదలు సృష్టించిన బీభత్సంతో ధరాలీ గ్రామం మరుభూమిని తలపిస్తోంది. ఈ క్రమంలో ఆర్మీని రంగంలోకి దించారు. సహాయకచర్యల్లో వారు వెంటనే దిగిపోరులను రక్షించే పనిలో పడ్డారు. ఇకపోతే భారీ ఎత్తున బురద వరద ధరాలీని కప్పేసింది. దీనికి సంబంధించి వెలుగులోకి వచ్చిన ఒక వీడియో హృద యాలను కలచివేస్తోంది. దూసుకొస్తున్న జలప్రవాహాన్ని తప్పించు కునేందుకు.. సహాయం కోసం ఆర్తనాదాలు చేసుకుంటూ కొందరు పరుగులు తీసిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ ప్రకృతి విలయం వారితో సహా అన్నింటిని జలసమాధి చేసింది. ఈ ఘటనలో ఇప్పటివరకు పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సహాయ చర్యలు చేపడుతున్నాయి. పర్వత సానువుల్లో ఉన్న ధరాలీ గ్రామంపై ఒక్కసారిగా జల ప్రవాహం విరుచుకుపడటంతో ఊరంతా అతలాకుతలమైంది. హోటళ్లు, నివాస భవనాలు కొట్టుకుపోయాయి. ఇప్పటి వరకు నలుగురు మృతి చెందినట్లు- అధికారులు చెబుతున్నప్పటికీ.. ఆ సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు- సమాచారం. ఘటన తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. 150 మంది సైనికులను ఘటనాస్థలానికి పంపినట్లు- ఆర్మీ తన అధికారిక 'ఎక్స్'లో పేర్కొంది. హర్షిల్‌లోని ఆర్మీ క్యాంప్‌నకు దాదాపు 4 కి.మీ దూరంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపింది. సమాచారం తెలుసుకున్న 10 నిమిషాల వ్యవధిలోనే సైన్యం అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టినట్లు- ఎక్స్‌లో పేర్కొంది. ప్రస్తుతం ఆపరేషన్ కొనసాగుతోందని.. ఇప్పటి వరకు 20 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చినట్లు- తెలిపింది. వారందర్నీ హర్షిల్‌లోని ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నట్లు- తెలిపింది. మరోవైపు స్థానిక పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గ్రామం మొత్తం బురద నీటితో నిండిపోవడంతో సహాయక



చర్యలకు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. మీటర్ల మేర పేరుకుపోయిన బురదను తొలగించి.. బాధితులను బయటకు తీసుకురావడం కత్తిమీద సాములా మారింది. మరోవైపు ఆకస్మిక వరదలకు గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన కుంభవృష్టి కారణంగానే ఒక్కసారిగా వరద ప్రవాహం ముంచుకొచ్చినట్లు- ప్రాథమిక అంచనాకు వచ్చారు. ధరాలీ ఘటన జరిగిన కొద్దిసేపటికే ఉత్తరకాశీలోని సుఖీ టోప్‌లోనూ మెరుపు వరదలు సంభవించాయి. దీంతో పలు ఇళ్లకు తీవ్ర నష్టం వాటిల్లగా.. మరికొన్ని కొట్టు-కుపోయాయి. ఈ విపత్తులపై ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ కాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# కాశ్మీర్‌లో కొనసాగుతున్న గాలింపు

## కుప్వారాలో ఉగ్రస్థావరం గుర్తింపు

## భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం

శ్రీనగర్,ఆగస్ట్5(సమయజ్యోతి):

జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు ముమ్మరంగా ఆపరేషన్లు చేపడుతున్నాయి. తాజాగా కుప్వారాలో ప్రాంతంలో ఉగ్ర స్థావరాన్ని గుర్తించారు. దీనిలో పెద్దసంఖ్యలో ఆయుధాలు ఉన్నాయి. ఈ ఆపరేషన్‌కు నాగ్ని టాప్ అని పేరుపెట్టారు. పక్కా సమాచారం మేరకు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, బీఎస్ఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని చినార్ కోర్ 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. ఇక్కడ ఒక తుపాకీ, 12 గ్రనేడ్లు, రెండు మ్యాగ్జైన్‌లు, ఇతర పేలుడు పదర్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే కుల్గాంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఆపరేషన్ అఖాల్‌లో ఇప్పటివరకు ముగ్గురు ఉగ్రవాదులను దళాలు మట్టుబెట్టిన విషయం తెలిసిందే. మంగళవారం ఐదో రోజు కూడా ఇది కొనసాగుతోంది. ఇక 'ఆపరేషన్ మహాదేవ్'లో పహల్గాం నరమేధానికి పాల్పడిన ఉగ్రమూకను మట్టు-పెట్టిన కొన్ని రోజుల్లోనే ఈ సైనిక చర్యలు చోటు-చేసుకోవడం గమనార్హం. జులై 30వ తేదీన ఆపరేషన్ శివ్‌శక్తిలో ఇద్దరు చొరబాటు- దారులను భద్రతా దళాలు హతమార్చాయి. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా భారీ ఆయుధ డంప్ దొరకడం గమనార్హం.

# రాహుల్ వ్యాఖ్యలు సమర్థనీయమే

## ఇండియా కూటమి పార్టీల మద్దతు

న్యూఢిల్లీ,ఆగస్ట్5(సమయజ్యోతి):

భారత్ జోడో యాత్ర సమయంలో దేశ సైన్యంపై అనుచిత వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు సోమవారం మందలించింది. అయితే రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు నిరాధారణమైనవని, రాహుల్ వ్యాఖ్యలు సరైనవేనంటూ ఇండియా కూటమిలోని పలు పార్టీలు అభిప్రాయపడ్డాయి. జాతీయ అంశాలను ప్రశ్నించే బాధ్యత రాజకీయ పార్టీలకు ఉంటుందని నొక్కి చెప్పాయి. ఈ అంశంపై ఇండియా కూటమిలోని పలు పార్టీలకు చెందిన సభాపక్ష నేతలు సమావేశమై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా న్యాయస్థానం అసాధారణమైన వ్యాఖ్యలు చేసింది. దీన్ని అన్ని పార్టీల నేతలూ అంగీకరించారు.

# పిల్లలను అమ్మే గ్యాంగులతో నమ్రతకు లింక్

## నమ్రత పోలీస్ కస్టడీలో పలు విషయాలు వెల్లడి

హైదరాబాద్,ఆగస్ట్5(సమయజ్యోతి):

సృష్టి అక్రమ సరోగసీ, ఐవీఎఫ్ శిశువుల కొనుగోలు కేసులో అరెస్టయిన డాక్టర్ నమ్రత ఐదు రోజుల కస్టడీలో పోలీసులు కీలక విషయాలను రాబట్టారు. పిల్లల్ని అమ్మే గ్యాంగులతో కూడా డాక్టర్ నమ్రతకు సంబంధాలు ఉన్నట్లు- విచారణలో తేలింది. మహారాష్ట్ర, అహ్మదాబాద్, ఆంధ్రాకు చెందిన పిల్లల్ని కిడ్నాప్ చేసే ముఠాలతో నమ్రతకు లింకులు ఉన్నాయి. పిల్లల్ని కొని అమ్ముతున్న నందిని, హర్ష, పవన్‌లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల కస్టడీలో వెల్లడైంది. గతంలోనూ పిల్లల్ని అమ్ముతూ నందిని ,హర్ష, పవన్ అరెస్ట్ కావడం గమనార్హం. ఒక్కొక్క పిల్లాడిని 3 నుంచి 5 లక్షల రూపాయలు ఇచ్చి డాక్టర్ నమ్రత కొనుగోలు చేసినట్లు- తెలిసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే దంపతులను సరోగోసి వైపు మళ్లించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు- కస్టడీలో నమ్రత నిజం బయటపెట్టింది. నందిని, హర్ష, పవన్.. కలిసి కొన్ని ఏళ్ల నుంచి పిల్లల్ని అమ్ముతున్న గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. హైదరాబాద్‌లో మరొక నాలుగు సెంటర్లకు కూడా పిల్లల్ని అమ్మినట్టు పోలీసులు గుర్తించారు. పెట్టీ- కేర్, హెడ్జ్ ,ఒయాసిస్, సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్లకు పిల్లలను అమ్మినట్లు- విచారణలో తేలింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఉన్న పలు ఫెర్టిలిటీ- సెంటర్లతో ఈ ముఠాకు సంబంధాలు ఉన్నాయి. పిల్లల అమ్మకాలతో పాటు- యువతి, యువకులను ఈ గ్యాంగ్ ట్రాప్ చేసింది. యువతి, యువకుల వీర్యకణాలు, అండాలను సేకరించి అమ్ముకుంది. డాక్టర్ నమ్రత పెద్ద ఎత్తున ఈ గ్యాంగ్‌కు డబ్బులు ముట్ట జెప్పినట్లు- కస్టడీలో బయటపడింది. డాక్టర్ సదానందం సృష్టి కేసులో కీలక పాత్ర పోషించినట్లు- కూడా వెల్లడైంది. గాంధీ ఆసుపత్రిలో అనస్థీషియా డాక్టర్‌గా సదానందం కొనసాగుతున్నాడు. ప్రతి ఆపరేషన్ వెనుక సదానందం పాత్ర ఉన్నట్లు- పోలీసులు గుర్తించారు.

# విద్యుత్ తీగ పడి యువరైతు దుర్మరణం

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు 5(సమయజ్యోతి):

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో విషాదం చోటుచేసుకుంది. ఓ యువకుడు పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో వాహనంతో సహా దగ్ధమై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందు గ్రామానికి చెందిన పర్సిక రాజు(35) అనే వ్యక్తి తన బైక్ వెళ్తుండగా గ్రామ శివారులో అతడిపై విద్యుత్ తీగ పడింది. బైక్ తో సహా అతడు కాలిపోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శవ పరీక్ష నిమిత్తం గుండాల ప్రభుత్వాత్రికి తరలించారు. మంటల్లో కాలిపోతున్న యువకుడిని చూసి కుటు-ంబ సభ్యులు, బంధువుల బాధపడే తీరు అందరినీ కలిచి వేసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియా వైరల్ గా మారింది.

# కాళేశ్వరంపై సిబిఐ విచారణను పట్టించుకోని కాంగ్రెస్

## బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు

పెద్దపల్లి,ఆగస్టు 5(సమయజ్యోతి):

కాళేశ్వరం నివేదిక లీకులను పట్టించుకోమని బిజెపి తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. అసెంబ్లీలో కాళేశ్వరం నివేదిక పెట్టిన తర్వాతే స్పందిస్తామని, కాళేశ్వరం నివేదిక ప్రభుత్వానిదా..కాంగ్రెస్‌దా అని చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. మొదటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బిజెపి చెబుతుందన్నారు. సిబిఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కానీ దీనిపై కాంగ్రెస్ వెనకడుగు వేసిందన్నారు. నిజాయితీగా,చిత్తశుద్ధితో విచారణ జరగాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు.బిసి రిజర్వేషన్లపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని, బిసి జాబితాలో ముస్లింలను కలపొద్దని కాంగ్రెస్ ను కోరారు. కాంగ్రెస్ కు బిసిలపై ప్రేమ ఉంటే మహేశ్వర్ గౌడ్ ముఖ్యమంత్రిని చేయాలని రాంచందర్ రావు పలుమార్లు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

# బావిలో దూకి కుటుంబం ఆత్మహత్య

వికారాబాద్,ఆగస్టు 5(సమయజ్యోతి):

వికారాబాద్ జిల్లా మోమిన్ పేట మండలంలో ఓ విషాదం చోటు-చేసుకుంది. చీమల్ దరి వద్ద అన్నా, చెల్లెలు బావిలో దూకి చనిపోయారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... చీమల్ దరి గ్రామంలోని ఓ వెంచర్ లో దంపతులు పని చేస్తున్నారు. దంపతుల మధ్య జరిగిన గొడవ తారాస్థాయికి చేరుకుంది. భర్తతో గొడవపడిన భార్య అలివేలు మనస్థాపానికి చెంది బావిలో దూకింది. భార్యను రక్షించాలని వెంటనే భర్త మాసయ్య బావిలో దూకాడు. అన్న, వదినను మునిగిపోవటం చూసి వారిని రక్షించేందుకు చెల్లెలు నాగమ్మ బావిలో దూకింది. బావిలో పడిన ముగ్గురిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. మొదట బావిలో దూకిన భార్య అలివేలు పరిస్థితి విషమంగా ఉంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మాసయ్య, చెల్లెలు నాగమ్మ మృతి చెందారు. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వ్యక్తి ఇంట్లో బుల్లెట్, గంజాయి స్వాధీనం

హైదరాబాద్,ఆగస్టు 5(సమయజ్యోతి):

మీర్‌పేట్‌లోని ఓ ఇంట్లో తుపాకీ బుల్లెట్ కలకలం సృష్టించింది. ఓ యువకుడి దగ్గర బుల్లెట్లతో పాటు గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మీర్‌పేట్‌లోని ఎస్ఎల్ఎన్ ఎస్ కాలనీలో చంద్రశేఖర్ అనే వ్యక్తి రెండేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. హైదరాబాద్ లోని పలు ప్రాంతాలలో దొంగతనం చేసి అద్దె ఇంట్లో తలదాచుకుంటున్నాడు. పోలీసులు చంద్రశేఖర్ అరెస్ట్ చేసి బుల్లెట్‌తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# నగరంలో మరోమారు భారీ వర్షం

## బంజారాహిల్స్, కూకట్‌పల్లిలో కుంగిన రోడ్లు

హైదరాబాద్,ఆగస్టు 5(సమయజ్యోతి):

హైదరాబాద్ నగరంలో పలు చోట్ల మరోమారు భారీ వర్షం కురిసింది. బంజారాహిల్స్ లో రోడ్డు కుంగింది. అకస్మాత్తుగా రోడ్డు కుంగడంతో అటుగా వస్తున్న నీటి ట్యాంకర్ అందులో పడిపోయింది. ఈ ఘటనలో ట్యాంకర్ డ్రైవర్‌తోపాటు- క్లీనర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న జీహెచ్ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. భారీ వర్షం కారణంగానే రోడ్డు కుంగినట్లు అధికారులు చెబుతున్నారు. కుంగిన చోట రోడ్డు కింద నాలా పైప్‌లైన్ ఉన్నట్లు- గుర్తించారు. రహదారి కుంగడంతో ఆ మార్గంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వాహనాన్ని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టారు. సోమవారం కురిసిన భారీ వర్షానికి కూకట్‌పల్లి జాతీయ రహదారిపై ముస్లిం గ్రేవ్ యార్డ్ వద్ద ఉన్న మ్యాన్‌హోల్‌తో పాటు రోడ్డు కుంగింది. దీంతో రహదారిపై రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. అదే రహదారిపై ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. ఫలితంగా స్టేషన్ నుంచి వై జంక్షన్ వరకు మురుగు నీరు ప్రవహిస్తోంది.

# నాగారం భూదాన్ భూములపై విచారణ

హైదరాబాద్,ఆగస్ట్5(సమయజ్యోతి):

నాగారంలోని భూదాన్ భూములపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. కేసు ఉపసంహరించుకోవాలని పోలీసులు బెదిరిస్తున్నారని పిటిషనర్ రాములు కోర్టుకు తెలిపారు. కానిస్టేబుల్ కోర్టు ముందు హాజరుకావాలని న్యాయమూర్తి గత విచారణ సందర్భంగా ఆదేశించారు. దీంతో కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మంగళవారం న్యాయమూర్తి ఎదుట విచారణ హాజరయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు ఆదేశం మేరకు పిటిషనర్‌కు ఫోన్ చేశానని కానిస్టేబుల్ కోర్టుకు తెలిపారు. విలేజ్ హిస్టరీ రికార్డులో వివరాల నమోదు కోసం రాములుకు ఫోన్ చేసినట్టు- పేర్కొన్నారు. విత్‌డ్రా చేసుకోవాలని పిటిషనర్‌ను ఎందుకు బెదిరిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఫిర్యాదులు మరోసారి రావొద్దని ఉన్నత న్యాయస్థానం హెచ్చరించింది.

# బిసి రిజర్వేషన్లపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఆందోళన

**నేడు జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా**

**గురువారం రాష్ట్రపతిని కలసి వినతిపత్రం సమర్పణ**

**మంత్రి వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్ వెల్లడి**

న్యూఢిల్లీ,ఆగస్టు 5(సమయజ్యోతి):

పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మంగళవారం ఆందోళన చేపట్టారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే లోక్‌సభలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానాలు ఇచ్చారు. మరోవైపు.. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి భారీగా చేరుకుంటున్నారు. ఇప్పటికే ఢిల్లీకి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ కీలక నేతలు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడారు. చిత్తశుద్ధి ఉంటే కేంద్రప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవద్దని సూచించారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపారని డిమాండ్ చేశారు. ఇప్పటికే ముసాయిదాని రాష్ట్రపతికి పంపించామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపాలని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. 50శాతం పరిమితిని ఎత్తివేయాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కార్యచరణ రూపొందించారని చెప్పుకొచ్చారు. బుధవారం జంతర్ మంతర్ వద్ద దాదాపు 20,000 వేల మందితో ఆందోళన నిర్వహిస్తున్నామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందని ఉద్ఘాటించారు. మైనార్టీలను అడ్డుగా చూపుతూ బీసీలకు రిజర్వేషన్లు అడ్డుకోవడం సరికాదని మంత్రి వాకిటి శ్రీహరి హితవు పలికారు. బీజేపీ ఎమ్మెల్యేలు తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు సపోర్టు చేశారని.. ఢిల్లీలో ఎందుకు మిన్నకుండిపోయారని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో కాకుండా ఢిల్లీలో ధర్నా చేయాలని సూచించారు. అసలు బీసీ రిజర్వేషన్ విషయంలో కవితకు ఏం సంబంధమని నిలదీశారు. కల్వకుంట్ల కుటుంబంలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదని విమర్శించారు. పార్లమెంట్‌లో ఎంపీల వాయిదా తీర్మానాలు, ధర్నా, గురువారం రాష్ట్రపతిని కలుస్తామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# కొండగట్టులో భారీగా భక్తుల రాక

**అన్నదానం టోకెన్ల కోసం ఎగబడ్డ జనం**

జగిత్యాల,ఆగస్ట్5(సమయజ్యోతి):

అంజన్న పుణ్య క్షేత్రం కొండగట్టులో భక్తుల రద్దీ కారణంగా అన్నదానం టోకెన్ల కోసం కొట్లాట జరిగింది. కొండగట్టు- ఆంజనేయ స్వామి సన్నిధికి భక్తులు మంగళవారం భారీగా తరలివెళ్లారు. మంగళవారం పైగా శ్రావణ మాసం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున గుట్టకు చేరుకొని అంజన్నకు మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. సూపరిండెంట్లు- సునీల్, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు- చేశారు. నిత్యం అన్నదానం చేసే సత్రం దగ్గర టోకెన్ల కోసం భక్తులు ఎక్కువ మంది రావడంతో స్వల్ప తోపులాట జరిగింది. మంగళవారం కేవలం 200 మంది భక్తులకు అన్నదానం అవకాశం కల్పించడంతో సుమారు 300 పైగా భక్తులు చేరుకున్నారు. దీంతో టోకెన్ల జారీ చేసే దగ్గర స్వల్ప తోపులాట జరిగింది. అన్నదానం టోకెన్ల సంఖ్యను పెంచాలని ఈ సందర్భంగా భక్తులు డిమాండ్ చేశారు. నిత్యం భక్తులతో కిటకిటకిటలాడే కొండగట్టు- అంజన్న ఆలయం ఆషాడ మాసంలో భక్తులు లేక వెలవెల పోయింది. ప్రస్తుతం శ్రావణ మాసం కావడంతో అంజన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు.

# దేశానికి ఆదర్శంగా పి-4 కార్యక్రమం

**పేదరిక నిర్మూలనలో అతిపెద్ద ముందడుగు**

**సాయం కోసం ఎవ్వరినీ బలవంతం చేయొద్దు**

**అధికారులకు సిఎం చంద్రబాబు సూచన**

అమరావతి,ఆగస్టు 5(సమయజ్యోతి):



పేదరిక నిర్మూలనకు రాష్ట్రంలో చేపట్టిన పీ-4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమని చెప్పారు. సచివాలయంలో పీ-4 కార్యక్రమంపై మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమాన్ని ఈ నెల 19 నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు- సీఎం తెలిపారు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదన్నారు. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుంది. బంగారు కుటుంబాలకు కావాల్సింది భావోద్వేగాలతో కూడిన బంధం, చేయూత మాత్రమే. సీఎస్ఆర్ నిధులతో బిల్ గేట్స్‌తో పాటు- వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి మించి కుటు-ంబాలను ఆదుకోవడటమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమం చేపట్టాం. ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు చేస్తున్నాం. బంగారు కుటు-ంబాలను ఆదుకోవడంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా స్వచ్ఛందంగానే జరుగుతుంది. ఎక్కడా ఎవరినీ బలవంతం చేయొద్దని అన్నారు. మంచి కార్యక్రమాలు అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తారు. ప్రజల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తారు. గతంలో జన్మభూమి, శ్రమదానం ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదే విధంగా విమర్శించారు. కొందరికి ఆర్థిక వనరులున్నా పేదల్ని ఆదుకోవడానికి మనసు రాదు. కొందరికి మనసు ఉన్నా సమయం ఉండకపోవచ్చు. అలాంటి వారిని గుర్తించాలి. ఇవాళ బంగారు కుటుంబంలో సాయం పొందిన వారే.. రేపు మార్గదర్శి అవ్వొచ్చు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందుకుంటూనే బంగారు కుటుంబాలకు పీ-4 ద్వారా అదనపు సాయం అందుతుంది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలను కలిసి వారిలో ఆలోచనలు రేకెత్తించాలని అన్నారు. ఇప్పటి వరకు 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తయింది. 1,03,938 మందిని మార్గదర్శులుగా గుర్తించాం. రాష్ట్రవ్యాప్తంగా 10లక్షల కుటు-ంబాలకు ఉన్న అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాం. 11 ప్రశ్నలతో వివరాలు నమోదు చేసి ఏఐతో విశ్లేషించాం. 31 శాతం మంది ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, 22 శాతం మంది వైద్య చికిత్సలకు సంబంధించి, 9 శాతం మంది తమ చిన్న చిన్న వ్యాపారాలను మరింత పెంచుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. బంగారు కుటు-ంబాలను దత్తత తీసుకోవడంతోపాటు- గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు కొందరు ముందుకొస్తున్నారు. నేను 250 కుటు-ంబాలను దత్తత తీసుకోవడంతోపాటు- ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాంఅని సీఎం చంద్రబాబు తెలిపారు.

# బండి సంజయ్‌కు మరోమారు సిట్ నోటీసులు

**8న విచారణకు రావాలని ఆదేశం**

హైదరాబాద్,ఆగస్ట్5(సమయజ్యోతి):

తెలంగాణ పాలిటిక్స్‌లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆగస్ట్ 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇవ్వాలని సిట్ కోరింది. ఈ మేరకు విచారణకు హాజరు అవుతానని సిట్‌కు బండి సంజయ్ రిప్లై ఇచ్చినట్లు- తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని పలుమార్లు బండి సంజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో ఆయన పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ ఇప్పటికే పలువురు రాజకీయ నాయకుల స్టే-టె-÷-మంట్లను రికార్డ్ చేసింది. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఫహీం ఖురేషి తదితర నేతల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. ఇందులో భాగంగా గతంలోనే బండి సంజయ్‌కు కూడా సిట్ నోటీ-సులు జారీ చేసింది. ముందస్తు షెడ్యూల్ వల్ల బండి సంజయ్ కు సిట్ విచారణకు హాజరు కాలేదు. దీంతో ఆగస్ట్ 8వ తేదీన విచారణకు హాజరు కావాలని తాజాగా సిట్ మరోసారి నోటీస్ జారీ చేసింది.

# మునుగోడుకోసం అవసరమైతే మళ్లీ రాజీనామా

**మంత్రి పదవి ఇస్తే ప్రజలకు ఉపయోగ పడేది**

**పదవిని అడ్డం పెట్టుకుని పైరవీలు చేసే రకం కాను**

**మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

నల్లగొండ,ఆగస్టు 5(సమయజ్యోతి):

కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ప్రజల కోసం మళ్లీ రాజీనామాకైనా సిద్ధమేనని.. అవసరమైతే మునుగోడుకు మళ్లీ ఉప ఎన్నిక తెస్తానని హాట్ కామెంట్స్ చేశారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తిత్వం నాది కాదని.. నాలాంటి వ్యక్తికి మంత్రి పదవి వస్తే ప్రజలకే మేలని అన్నారు. మంగళవారం సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మ గూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఎల్బీనగర్ నుంచి పోటీ- చేస్తే మంత్రి పదవి వచ్చేదని.. కానీ, నియోజకవర్గ ప్రజల కోసమే మునుగోడు నుంచి పోటీ చేసినట్లు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తనకు పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగ పడుతుందని.. అందరిలా పైరవీలు చేస్తూ దోచుకునేవాడిని కాదని వ్యాఖ్యానించారు. రాజగోపాల్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కావాలా? మునుగోడు ప్రజలు కావాలా? అంటే మునుగోడు ప్రజలే కావాలని కోరుకుంటానన్నారు. పార్టీలో చేరినప్పుడు మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవులను అడ్డుపెట్టుకుని సంపాదించేవాడిని కాదు. నా స్వార్థం కోసం మంత్రి పదవిని అడగటం లేదు. మంత్రినైతే మంచి జరుగుతుందని మునుగోడు ప్రజలు భావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవి ఇస్తారా? ఇవ్వరా? అనేది పార్టీ అధిష్ఠానం ఇష్టం. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు, నా జూనియర్లకు కూడా ఇచ్చారు. ఎవరి కాళ్లో మొక్కి పదవి తెచ్చుకోవాల నుకుకోవట్లేదు. దిగజారి బతకడం నాకు తెలియదు. మళ్లీ త్యాగానికైనా సిద్ధం.. ఎంత దూరమైనా మునుగోడు ప్రజల కోసం వెళ్తా. నా నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పని ఏనాడూ చేయనని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నేను ప్రభుత్వానికి ఏదైనా వ్యతిరేకంగా మాట్లాడితే మంత్రి పదవి రాలేదని మాట్లాడుతున్నానని అంటున్నారు. ఎల్బీనగర్ నుంచి పోటీ- చేస్తే మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం చెప్పినా కూడా మునుగోడు ప్రజల కోసం ఇక్కడ నుండే పోటీ- చేశానని చెప్పారు. పదవిని అడ్డుపెట్టుకుని కోట్లు సంపాదించే వాడికి పదవి కావాలి కానీ.. నాలాంటి వారికి ప్రజలే ముఖ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరేటప్పుడే తనకు మంత్రి పదవి హామీ ఇచ్చారని.. ఆ తర్వాత ఎంపీ ఎన్నికల సమయంలోనూ అలాంటి హామీనే ఇచ్చారంటూ కాంగ్రెస్ పార్టీ పెద్దలకు గుర్తు చేశారు. పదవి ఇస్తారా.. ఇవ్వరా అనేది మీ ఇష్టం.. సీనియర్ నేతనే కాబట్టి మంత్రి పదవి ఆశించడంలో తప్పులేదంటూ మనసులో ఉన్నది చెప్పానని అన్నారు.

# స్మార్ట్ కార్డ్ తరహాలో రేషన్ కార్డు

**25 నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ**

**రేషన్ షాపులు ద్వారా జీసీసీ ఉత్పత్తులు అందించే యోచన**

**వయసుపైబడ్డ వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దకే సరుకులు**

**పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

విశాఖపట్నం,ఆగస్ట్5(సమయజ్యోతి):

రాష్ట్రంలో మరింత కొత్తగా.. వినూత్నంగా రేషన్ కార్డ్స్ అందిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రేషన్ సరుకులను ఆగస్టు 25 నుంచి కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేస్తామని విశాఖలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఏటీ-ఎం కార్డు సైజులో నూతన రేషన్ కార్డులు ఉండబోతున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. కొన్ని మ్యాపింగ్ సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరిస్తున్నట్లు- పేర్కొన్నారు. రేషన్ షాపులు ద్వారా జీసీసీ ఉత్పత్తులు అందించే నిర్ణయం తీసుకున్నట్లు- చెప్పారు. నాలుగు కోట్ల మందికి రేషన్ సరుకులు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్యాస్ రాయితీ విషయంలో కూడా డిజిటల్ వారెంట్ కూపన్ను అందిస్తున్నట్లు- తెలిపారు. మూడు రోజులు ఉత్తరాంధ్రలో పర్యటించినట్లు- మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తు చేశారు. పౌర సరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు- చెప్పారు. నెలలో 15 రోజుల పాటు- రేషన్ సరుకులు అందజేస్తామని పేర్కొన్నారు. 65 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులకు, వికలాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు ఇంటివద్దకే సరకులు అందిస్తామని వివరించారు. ఎండీయూ వాహనాలు తొలగింపు విషయంలో సుమారు రూ.200 కోట్లు నష్టం జరిగిన ముందుకు వెళ్ళామని నాందెడ్ల మనోహర్ చెప్పుకొచ్చారు. దీపం పథకం ద్వారా ఫేజ్-1లో కోటి మందికి, ఫేజ్ 2లో 95 లక్షల మందికి సబ్సిడీ అందించినట్లు- తెలిపారు. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నట్లు- తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశాని ఆయన స్పష్టం చేశారు. అలాగే.. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెట్టినట్లు-, చట్టంలో మార్పులు కూడా తీసుకొచ్చినట్లు- ఆయన వివరించారు. ప్రభుత్వ పథకాల అమలు విషయంలో తప్పు ఎవరు చేసినా కఠిన చర్యలు ఉంటాయని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నెలలో 15 రోజుల పాటు- రేషన్ సరకులు అందజేస్తున్నామని చెప్పారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30 వరకు ఇంటివద్దే అందిస్తున్నామని వివరించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో మంత్రి మాట్లాడారు. ప్రజలకు మరింత మెరుగ్గా రేషన్ సరకులు అందజేసేందుకు సుమారు రూ.200 కోట్ల భారం పడినా ముందుకు వెళ్లాం. దీపం పథకం ద్వారా ఫేజ్-1లో కోటి మందికి ఫేజ్-2లో 95 లక్షల మందికి సబ్సిడీ అందించాం. ఫేజ్-3లో సాంకేతిక సమస్యలను అధిగమించి అర్హులందరికీ పథక ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటాం. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు- మా దృష్టికి వచ్చింది. దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశాం. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలుంటాయి. లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ జమ కాకపోతే అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలి. ఆగస్ట్ 25 నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తాం. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెంచాం.. చట్టంలోనూ మార్పులు తీసుకొచ్చాం. లీగల్ మెట్రాలజీ శాఖ కార్యకలాపాలను పెంచాం. గత సీజన్‌లో రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం సేకరించి రూ.12వేల కోట్లు- చెల్లించాం. ఏఐ సహాయంతో పౌర సరఫరాల శాఖలో డేటా అనాలసిస్ చేస్తున్నాం.. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నాం. ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో పనిచేయాలని నాదెండ్ల మనోహర్ అన్నారు.







# బౌలింగ్ లోనే కాదు మాటల్లోనే మనోడు తోపే

భారత్, ఇంగ్లండ్ మధ్య జరిగిన ప్రతిష్ఠాత్మక ఆండర్సన్–టెండూల్కర్ టెస్ట్ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి, టీమిండియాను గెలిపించిన బౌలర్లలో మహ్మద్ సిరాజ్ ముందున్నాడు. అయితే సిరీస్ గెలిచిన ఆనందంలో ఉన్న సిరాజ్‌ను ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు, సిరాజ్ చాలా కూల్‌గా, స్ట్రెట్ ఫార్వార్డ్‌గా సమాధానం ఇచ్చి తన నోరు మూయించాడు. ఓవల్ టెస్టులో ఇంగ్లాండ్‌ను 6 పరుగుల తేడాతో ఓడించి, సిరీస్‌ను 2–2తో సమం చేసిన తర్వాత, మహ్మద్ సిరాజ్ ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారాడు. ఈ సిరీస్‌లో అద్భుతమైన బౌలింగ్ చేసి, చివరి మ్యాచ్‌లో 5 వికెట్లు తీసి టీమ్ ఇండియాను గెలిపించాడు. మ్యాచ్ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి ప్రెస్ కాన్ఫరెన్స్‌కు వచ్చిన సిరాజ్‌కు ఒక జర్నలిస్ట్ నుండి ఊహించని ప్రశ్న ఎదురైంది. ఈ సిరీస్ గురించి అడిగితే బాగుండేది కానీ, జర్నలిస్ట్ మాత్రం గతంలో జరిగిన బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ గురించి అడిగాడు. ఆ ప్రశ్న విన్న సిరాజ్ నవ్వుతూ చాలా ప్రశాంతంగా.. "సార్, బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో కూడా నేను 20 వికెట్లు తీశాను. ఆ సిరీస్‌లో జస్సీ భాయ్ అద్భుతంగా బౌలింగ్ చేస్తుంటే, నా పని తనకు సహకారం అందించడమే" అని చెప్పాడు. సిరాజ్ ఇచ్చిన ఈ కౌంటర్ జవాబుతో ఆ జర్నలిస్ట్ ఒక్కసారిగా సైలెంట్ అయిపోయాడు. ఈ సంఘటన సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో సిరాజ్ అభిమానులు అతడి తెలివైన సమాధానానికి ఫిదా అయ్యారు. ఓవల్ టెస్టులో ఐదు వికెట్లు తీసిన సిరాజ్, ఈ సిరీస్‌లో మొత్తం 23 వికెట్లు పడగొట్టి, సరికొత్త రికార్డును సృష్టించాడు. విదేశీ గడ్డపై ఒక టెస్ట్ సిరీస్‌లో 20 కన్నా ఎక్కువ వికెట్లు తీసిన మూడవ భారత బౌలర్‌గా నిలిచాడు. అంతకుముందు ఈ ఘనత కపిల్ దేవ్, జస్ప్రీత్ బుమ్రా మాత్రమే సాధించారు. సిరాజ్ అంకితభావం, కష్టపడే తత్వాన్ని చూసి మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ చాలా సార్లు మెచ్చుకున్నారు. టీమ్ కోసం సిరాజ్ తన సర్వస్వాన్ని పణంగా పెడతాడని కోహ్లీ ఇప్పటికే చాలా సందర్భాల్లో చెప్పారు. ఈ సిరీస్‌లో సిరాజ్ చేసిన ప్రదర్శన కోహ్లీ మాటలను నిజం చేసింది. ఓవల్ టెస్ట్ చివరి రోజు, ఇంగ్లాండ్ గెలవడానికి కేవలం 6 పరుగులు కావాల్సిన సమయంలో, సిరాజ్ గస్ అట్కిన్సన్‌ను క్లీన్ బౌల్డ్ చేసి భారత్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. అంతకుముందు నాలుగో రోజు క్యాచ్ మిస్ చేసినందుకు విమర్శలు ఎదుర్కొన్న సిరాజ్, ఈ బౌలింగ్‌తో తనపై వచ్చిన విమర్శలన్నింటికీ సమాధానం ఇచ్చాడు. చివరి సెషన్‌లో సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ కలిసి ఇంగ్లాండ్ బ్యాటింగ్‌ను కూల్చి, మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పారు.



# భారత్, ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్ లో పలు రికార్డులు నమోదు

ఇది సాధారణ టెస్టు సిరీస్ కాదు. ఇటీవల కాలంలో జరిగిన ఆల్ టైమ్ బెస్ట్ సిరీస్?లలో అండర్సన్– తెండుల్కర్ ట్రోఫీ టాప్ లిస్టులో ఉంటుందని చెప్పవచ్చు. టెస్టు క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు జరిగిన 854 టెస్టు ద్వైపాక్షిక సిరీస్‌లు జరిగాయి. అందులో కేవలం రెండు సందర్భాల్లోనే 7,000ం పరుగులు నమోదయ్యాయి. ఈ రెండింటిలో తాజా అండర్సన్–తెండుల్కర్ ట్రోఫీ ఒకటి. 1993లో జరిగిన యాషెస్ సిరీస్ (6 మ్యాచ్‌లు, 7,221 పరుగులు) తర్వాత, ఇప్పుడు ఇంగ్లాండ్– భారత్ 2025 (5 టెస్టులు, 7,187 పరుగులు) సిరీస్ ఈ ఘనతను సాధించింది.సిరీస్‌లో మొత్తం 7,187 పరుగులు నమోదు కావడం చరిత్రలోనే రెండోసారి. ఓ వైపు ఇంగ్లాండ్ బ్యాటర్లు, మరోవైపు భారత యువ బ్యాటర్ల అద్భుత ప్రదర్శనతో అభిమానులకు ఎన్నో ఆహ్లాదకరమైన క్షణాలు దక్కాయి. మొత్తం 19 సెంచరీలు, 470 బౌండరీలు కేవలం ఇండియా ఆటగాళ్లవే కావడం, రెండు దేశాల కలిపి పరుగుల వరదలో కొత్త అధ్యాయం మొదలైంది. ఈ సిరీస్‌ని టెస్ట్ క్రికెట్ అభిమానులు ఎప్పటికీ మర్చిపోలేరు.భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సిరీస్‌లో మొత్తం 754 పరుగులు చేసి, గ్రాహమ్ గూచ్ (752 %–% 1990) రికార్డును అధిగమించాడు. ఇండియా తరఫున టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన కెప్టెన్‌గా గిల్ రికార్డును నెలకొల్పాడు. అంతే కాదు, సిరీస్‌లో నాలుగు సెంచరీలు బాదడం ద్వారా డాన్ బ్రాడ్‌మన్, కోహ్లీ, గావస్కర్ లాంటి దిగ్గజాల సరసన నిలిచాడు. ఇంగ్లాండ్ తరఫున జో రూట్ తన 13వ సెంచరీని భారత్‌పై నమోదు చేసి, ఒకే జట్టుపై అత్యధిక సెంచరీలు చేసిన ఇంగ్లాండ్ బ్యాటర్‌గా చరిత్రలో నిలిచారు. అలాగే సొంత గడ్డపై భారత్‌పై 2,000 పరుగుల మైలురాయిని దాటిన రెండో ఆటగాడిగా డాన్ బ్రాడ్‌మన్ తరువాత రూట్ నిలిచారు. మరోవైపు జడేజా ఈ సిరీస్‌లో ఆరు హాఫ్ సెంచరీలు బాది కొత్త రికార్డు నెలకొల్పారు.తాజాగా ముగిసిన ఐదో టెస్టులో ఇండియా 6 పరుగుల స్వల్ప తేడాతో విజయం సాధించింది. ఇది భారత టెస్టు చరిత్రలో అత్యంత తక్కువ మార్జిన్ విజయం. చివరి రోజు మ్యాచ్ ఉత్కంఠ కొనసాగింది. 339–6తో బ్యాటింగ్ కొనసాగించిన ఇంగ్లాండ్?ను టీమ్ఇండియా 28 పరుగులిచ్చి చివరి నాలుగు వికెట్లు పడగొట్టి చిరస్మరణీయ విజయం అందుకుంది.1993లో జరిగిన యాషెస్ సిరీస్‌లో మొత్తం 6 మ్యాచ్‌లలో 7,221 పరుగులు నమోదయ్యాయి. అయితే అది ఆరు టెస్టు మ్యాచ్?ల సిరీస్. కానీ, ఐదు టెస్టుల సిరీస్ తీసుకున్నట్లైతే మాత్రం ఆ రికార్డ్ బ్రేక్ అయినట్లే. ఈసారి ఇంగ్లాండ్ ఇండియా సిరీస్‌లో 7,187 పరుగులు నమోదు కావడంతో 30 ఏళ్ల రికార్డు పక్కనపడింది.



# మళ్లీ బ్యాట్ పట్టిన సూర్యకుమార్

భారత 20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కొన్ని రోజుల కిందట స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ చేయించుకున్నాడు. త్వరలోనే ఆసియా కప్ 2025 జరగనున్న తరుణంలో టీమిండియా అభిమానులకు గుడ్ న్యూస్ వచ్చింది. సర్జరీ తర్వాత భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మొదటిసారి ప్రాక్టీస్ కోసం వచ్చాడు. గత వారం సూర్యకుమార్ యాదవ్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడని తెలిసింది. దాంతో ఆసియా కప్ టోర్నీకి సూర్య అందుబాటులో ఉంటాడని తేలడంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూలై నెలలో జర్మనీలో ఈ సూర్యకుమార్‌కు స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ జరిగిందని తెలిసిందే.సూర్యకుమార్ యాదవ్ కడుపు దిగువ కుడి భాగంలో స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ నుంచి కోలుకుంటున్నాడు. సర్జరీ తరువాత కొన్ని రోజుల నుంచి భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో సూర్య ఉన్నాడు. సెప్టెంబర్ 9 నుండి ప్రారంభమయ్యే ఆసియా కప్ కి ముందు అతను జట్టుతో చేరనున్నాడని కన్ఫామ్ అయింది. ఈసారి ఆసియా కప్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో నిర్వహించాలని ఏసీసీ ఇటీవల ప్రకటించింది. మొదట ఆగస్టులో బంగ్లాదేశ్‌తో జరిగే టీ20 సిరీస్‌తో సూర్యకుమార్ యాదవ్ కమ్ బ్యాక్ చేయాల్సి ఉంది. అయితే ఈ సిరీస్ వచ్చే ఏడాది వరకు వాయిదా పడింది. దాంతో టీ20 కెప్టెన్ సూర్య నేరుగా ఆసియా కప్‌లో ఆడనున్నాడు. సూర్యను దిలీప్ ట్రోఫీలో వెస్ట్ జోన్ జట్టులో కూడా చేర్చారు. కానీ స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ కారణంగా సూర్యకుమార్ యాదవ్ ఈ టోర్నమెంట్‌ను వదులుకోవలసి వచ్చింది. ఆసియా కప్‌లో పాకిస్తాన్ తో ఆడవద్దని టీమిండియాపై ఒత్తిడి పెరుగుతోంది. దీనికి తోడు ఇటీవల జరిగిన రిటైర్డ్ క్రికెటర్ల లెజెండ్స్ టోర్నీలో సెమీఫైనల్లో పాకిస్తాన్ తో తాము ఆడే ప్రసక్తి లేదని భారత ఆటగాళ్లు స్పష్టం చేశారు. వారి నిర్ణయాన్ని స్పాన్సర్లు సైతం స్వాగతించారు. దాని ఫలితంగా పాకిస్తాన్ జట్టు నేరుగా ఫైనల్ చేరింది. అదే సమయంలో ఆసియా కప్ షెడ్యూల్ ప్రకటన రావడంతో పాకిస్తాన్ తో మ్యాచులు ఆడటం అవసరమా.. ఆ దేశాన్ని మరింత దెబ్బకొట్టాలన్న డిమాండ్ వచ్చింది. భారత ప్రజల ప్రాణాలు తీసిన నేరస్తులు పాకిస్తాన్ ఉగ్రవాదులు అని, అలాంటి దేశంతో మ్యాచులు ఆడటం వృథా అని కొందరు.. జాతీయ భద్రతకే ముప్పు కలిగించిన దేశంతో ఏ టోర్నీల్లోనూ పాల్గొనవద్దన్న డిమాండ్స్ పెరుగుతున్నాయి.భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ ఆసియా కప్ ద్వారా జట్టులోకి తిరిగి రానున్నాడు. ఇదే ఆసియా కప్‌లో పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌పై వివాదం చెలరేగింది. కొంతమంది ఈ మ్యాచ్‌ను వ్యతిరేకిస్తున్నారు. పాకిస్తాన్‌తో ఆడి వారిని వీలుచిక్కినప్పుడల్లా చిత్తుగా ఓడించాలని మరికొందరు కోరుకుంటున్నారు. భారత్, పాకిస్తాన్‌తో ఆడకపోతే, ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో టీమిండియాకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



# మెస్సీ భారత్ పర్యటనకు షెడ్యూల్ ఫిక్స్

ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ డిసెంబర్ 12న భారతదేశానికి రానున్నాడు. కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబై, న్యూఢిల్లీలలో మెస్సీ సందర్శన జరగనుంది. 2011లో కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో వెనిజులాతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన మెస్సీకి.. 14 ఏళ్ల తర్వాత ఇది రెండోసారి భారత్ లో పర్యటించడం. ప్రస్తుతం 38 ఏళ్ల మెస్సీ అమెరికాలోని మేజర్ లీగ్ సాకర్‌లో ఇంటర్ మయామీ జట్టు తరపున ఆడుతున్నాడు. కోల్‌కతాలో రెండు రోజులు ఉండనున్న మెస్సీ.. అక్కడ డిసెంబర్ 13న %ఎక్రా% రోడ్డులో 70 అడుగుల ఎత్తైన తన విగ్రహాన్ని ఆవిష్కరిస్తాడు. అయితే.. ఇది ప్రపంచంలోనే మెస్సీ యొక్క అతి పెద్ద విగ్రహంగా నిలుస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఆ తర్వాత ఈడెన్ గార్డెన్స్‌లో %+టూూ% కన్సర్ట్ తో పాటు సౌరవ్ గంగూలీ, జాన్ అబ్రహం, లియాండర్ పేస్, బైచుంగ్ భూటియా వంటి ప్రముఖులతో కలిసి.. ఏడు మంది ఆటగాళ్లతో కూడిన సాఫ్ట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ పాల్గొననున్నాడు. ఇక ఆ తర్వాత అర్జెంటీనా ఆటగాళ్లతో ఒక మాస్టర్ క్లాస్ కూడా జరుగుతుంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ కన్సర్ట్ లో పాల్గొని మెస్సీని సన్మానించనున్నారు. కోల్‌కతా తర్వాత అహ్మదాబాద్‌లో అదానీ ఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొననున్న మెస్సీ.. దాని తర్వాత అక్కడి నుండి ముంబైకి వెళ్తాడు. అయితే అక్కడ మెస్సీ క్రికెట్ మ్యాచ్ ఆడడం లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. డిసెంబర్ 14న ముంబైలోని వాంఖడే స్టేడియంలో %+టూూ% కన్సర్ట్, %+టూూ% కప్ జరుగుతాయి. అక్కడే భారత ఫుట్‌బాల్ జట్టుతో సంభాషించి, మరో సాఫ్ట్‌బాల్ మ్యాచ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. చివరగా డిసెంబర్ 15న న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమై.. ఆ తర్వాత అరుణ్ జైట్లీ స్టేడియంలో %+టూూ% కన్సర్ట్ లో పాల్గొంటాడు. ప్రతి నగరంలో మెస్సీ పిల్లలతో మాస్టర్ క్లాస్ నిర్వహిస్తాడు. యువ ఫుట్‌బాల్ ఆటగాళ్లను ప్రోత్సహించడమే ఈ పర్యటన యొక్క ముఖ్య లక్ష్యం. మెస్సీ సోషల్ మీడియాలో అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు.

# శార్దూల్ టెస్ట్ కెరీర్ ముగిసినట్లేనా?



ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరిగిన 5 మ్యాచ్‌ల ఉత్కంఠభరితమైన టెస్ట్ సిరీస్ ఎట్టకేలకు ముగిసింది. ఐదు మ్యాచ్‌లు అంటే అన్ని టెస్ట్‌లు ఐదవ రోజున ముగిశాయి. ఇటీవలి సంవత్సరాలలో ఇది అత్యుత్తమ సిరీస్. సోమవారం (ఆగస్టు 4) ఓవల్‌లో జరిగిన ఐదవ టెస్ట్ చివరి రోజున భారత్ ఉత్కంఠభరితమైన విజయాన్ని సాధించింది. ఈ విధంగా, సిరీస్‌ను 2–2తో డ్రాగా ముగించింది. ఇందులో చాలా మంది ఆటగాళ్ళు బాగా రాణించారు. అయితే కొంతమందికి ఈ పర్యటన నిరాశపరిచింది. ఇంగ్లాండ్ లేదా ఆస్ట్రే లియా పర్యటన టీం ఇండియాలోని కొంతమంది ఆటగాళ్లకు ఎల్లప్పుడూ మంచిది కాదు. ఇది వారి కెరీర్‌పై నీలిమేఘంలా మారింది. అక్కడ నిరాశపరిచే ప్రదర్శన తర్వాతే వారి కెరీర్ ముగుస్తుంది. ఇది చాలా మంది కీలక ఆటగాళ్లతో జరిగింది. రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్, ఆర్పి సింగ్, రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి పెద్ద ఆటగాళు ్ళ ఇంగ్లాండ్ లేదా ఆస్ట్రేలియాలో తమ చివరి టెస్ట్ మ్యాచ్ ఆడారు. ఇప్పుడు ఇది మళ్ళీ జరగవచ్చు. ఈసారి ఆల్ రౌండర్ కెరీర్ ముగియవచ్చు.ఇక్కడ మనం 33 ఏళ్ల ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ గురించి మాట్లాడుతున్నాం. ఈ పర్యటన అతనికి మరచిపోలేనిది. అతను చివరిసారిగా టీం ఇండియా తరపున ఆడి ఉండవచ్చు. రెండేళ్ల తర్వాత శార్దూల్‌కు టెస్ట్ ఆడే అవకాశం లభించింది. అతను టీం ఇండియా ప్రణాళికలకు దూరంగా ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన తర్వాత, అతను ఇంగ్లాండ్ పర్యటన కోసం జట్టులోకి వచ్చాడు, కానీ అది అతనికి నిరాశపరిచింది.సిరీస్‌లోని మొదటి టెస్ట్‌లో అతనికి అవకాశం లభించింది. లీడ్స్‌లో అతను ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయాడు. బ్యాటింగ్‌లో అతను 1, 4 పరుగులు మాత్రమే సాధించాడు. బౌలింగ్‌లో, అతను రెండవ ఇన్నింగ్స్‌లో 2 వికెట్లను సాధించాడు. ఈ దశ శార్దూల్‌కు దు ఆర్ డై పరిస్థితి. లీడ్స్ టెస్ట్ మ్యాచ్ తర్వాత అతన్ని జట్టు నుంచి తొలగించారు. బర్మింగ్‌హామ్, లార్డ్స్‌లో ఆడలేకపోయాడు. అతను మాంచెస్టర్ టెస్ట్‌లో తిరిగి వచ్చాడు. కానీ, ఇది కూడా అతనికి మర్చిపోలేనిది. అతను మొదటి ఇన్నింగ్స్‌లో 41 పరుగులు చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆ తర్వాత, అతను బౌలింగ్‌లో 55 పరుగులు



# విశ్వంభరలో ఆషిక రంగనా- పోస్టర్ విడుదల

మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న భారీ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ మూవీ 'విశ్వంభర'. యంగ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ డ్రామా, ఇప్పటివరకు వచ్చిన ప్రతి అప్డేట్‌తో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ నుంచి స్పెషల్ ట్రీట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఆషిక రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌కి వచ్చిన స్పందన చూస్తుంటే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. పోస్టర్ అదిరిపోయింది, ఆషిక కళ్ళలో మ్యాజిక్ ఉంది, విశ్వంభరకు మరో హైలైట్ ఆమె అవుతుందని ఫిక్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందాన్ని, క్యారెక్టర్ డెప్త్‌ను హైలైట్ చేస్తోంది. చిరు సరసన త్రిషతో పాటు–, సెకండ్ హీరోయిన్ ఈ కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ నటిస్తోంది. ఈ సినిమాను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్న యూవీ క్రియేషన్స్, ప్రమోషనల్ స్ట్రాటజీలో కూడా కొత్తదనం చూపించబోతున్నారు. బర్త్ డే పోస్టర్‌తో మొదలైన ఈ ప్రమోషన్ రన్ ఇక నుంచి రెగ్యులర్‌గా సాగనుందని సమాచారం. భారీ సెట్‌లు, విజువల్ ఎఫెక్ట్స్, మైథలాజికల్ టచ్‌తో కూడిన ఈ సినిమాను వినాయక చవితి లేదా దసరా సీజన్లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అంతే కాదు ఎం.ఎం.కీరవాణి అందిస్తున్న సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, రీసెంట్ గా 'హరి హర వీరమల్లు' వంటి సినిమాల్లో తన వర్క్‌కి ఇంటర్నేషనల్ గుర్తింపు తెచ్చుకున్న కీరవాణి.. ఇప్పుడు 'విశ్వంభర'కి సంగీతం అందిస్తుండటంతో మ్యూజిక్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి

## పృథ్వీరాజ్‌ను వదిలి షారూఖ్‌కు అవార్డా

### జాతీయ చలనచిత్ర అవార్డులపై విమర్శలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల జాబితాలో ఉత్తమ నటుడి ఎంపికపై విమర్శలు వస్తూనే ఉన్నాయి. 2023లో విడుదలైన సినిమాలకు గాను ఉత్తమ నటుడుగా బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్, ఉత్తమ సపోర్టింగ్ నటుడిగా విజయ రాఘవన్, బెస్ట్ సినిమాగా భగవంత్ కేసరి సినిమాలు అవార్డ్స్ అందుకున్నాయి. అలాగే వివిధ విభాగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని విజేతలుగా ప్రకటించింది నేషనల్ అవార్డ్స్ జ్యూరీ. అయితే ఈ అవార్డ్స్ నేషనల్ జ్యూరీకి తలనొప్పులు తెచ్చింది. 2023 బెస్ట్ యాక్టర్ గా జావాన్ సినిమాకు గాను షారుక్‌కు ఈ అవార్డు ప్రకటించడం పట్ల విమర్శలు వస్తున్నాయి. అదే ఏడాదిలో మళయాళంలో పృధ్వి రాజ్ సుకుమారన్ హీరోగా ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. ఈ సినిమాలో పృధ్వి రాజ్ నటనకు అవార్డు దక్కకపోవడంతో జ్యూరీపై విమర్శలు వచ్చాయి. వాస్తవంగా చూస్తే ఆడుజీవితంలో పృధ్వి రాజ్ సుకుమారన్ నటన అద్భుతంగా ఉంటుంది. బ్రతుకు తెరువుకు దుబాయ్ వెళ్లిన ఓ సామాన్యుడు అక్కడ ఎడారిలో అనుభవించిన నరకం అనుభవించే క్యారక్టర్ లో పృధ్వి రాజ్ అద్భుతంగా నటించాడు. ఇక జవాన్ సినిమాలో షారుక్ నటన గొప్పగా ఏమి ఉండదు. ఓ రొటీన్ రెగ్యులర్ కమర్షియాల్ సినిమాలో ఎలా ఉంటుందో అలా ఉంటుంది. ఈ విషయమై నేషనల్ జ్యూరీని ప్రశించగా జ్యూరీ సభ్యుడు ప్రదీప్ నాయర్ స్పందించారు. ఆడు జీవితంలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటన ఆర్టిఫిషయల్ గా ఉంటుంది. సహజత్వ లేదని జ్యూరీ ఛైర్‌పర్సన్ అశుతోష్ గోవారికర్ తో పాటు సహా జ్యూరీ సభ్యులు పలువురు భావించడంతో పృథ్వీరాజ్ కు అవార్డు దక్కలేదని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై నెటిజన్స్ ఫైర్ అవుతున్నారు. స్వప్రయోజనాల ముందు ఎంతటి అద్భుతమైన నటన కనబరించిన ఇలానే ఉంటుందని కామెంట్స్ వినిపిస్తున్నాయి.



## ఉస్తాద్‌లోపవన్ షెడ్యూల్ పూర్తి

### దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడి

పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి దర్శకుడు గుడ్‌న్యూస్ చెప్పారు. ఈ సినిమాలో పవన్‌కు సంబంధించిన షెడ్యూల్ పూర్తయినట్లు– తెలుపుతూ ఓ ప్రత్యేక ఫొటో పంచుకున్నారు. ఇటీవలే 'హరిహర వీరమల్లు'తో పలకరించిన పవన్‌కల్యాణ్ అదే జోష్‌తో ఇప్పుడు 'ఉస్తాద్ భగత్‌సింగ్'ను పూర్తి చేశారు. ఆయన సపోర్ట్ వల్లే ఈ షెడ్యూల్ త్వరగా పూర్తయినట్లు– హరీశ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌పై ప్రశంసలు కురిపించారు. మాటిస్తే నిలబెట్టుకోవడం, మాట మీదే నిలబడడం.. మీరు పక్కనుంటే కరెంట్ పాకినట్లే అంటూ ఆయనతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఈ రోజును తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని దర్శకుడు తెలిపారు. పవన్ ఎనర్జీ సినిమాకు మరింత పవర్‌ను ఇచ్చిందన్నారు. సపోర్ట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం హరీశ్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో పవన్ సింపుల్ లుక్‌లో కనిపించడంతో అభిమానులు షేర్ చేస్తున్నారు. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ – హరీశ్‌శంకర్) కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టు–కున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. దేవీశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పవన్ 'ఓజీ'లో నటిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఇది రానుంది.



## సినిమా ఫెయిల్యూర్‌కు రివ్యూలు కూడా ఓ కారణం

### హీరోయిన్ మృణాళ్ ఠాకూర్

ఏదైనా ఒక సినిమా వచ్చిందంటే చాలు.. యూట్యూబ్ రివ్యూల, ట్విట్టర్ కామెంట్స్, ఇన్‌స్టా రీల్స్‌తో మైండ్ బ్లాక్ అంటూ ఇష్టం వచ్చిన రివ్యూ ఇస్తున్నారు. అసలు సినిమా ఎలా ఉందో తెలిసేలోపే.. 'ఫ్లాప్', 'ఓవరాక్టింగ్', 'బోర్' అంటూ ట్యాగ్‌లతో దండం పెట్టి ప్రేక్షకుల అభిప్రాయాలను దారి తప్పిస్తున్నారు ఈ ట్రెండ్‌పై ఇప్పటికే పలువురు హీరోలు, నిర్మాతలు నిప్పులు చెరిగారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ– మృణాల్ ఠాకూర్ కూడా ఇదే విషయంపై స్పందించింది. ఇటివల బాలీవుడ్ లో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' విడుదలైన మిశ్రమ స్పందన అందుకుంది. ఈ క్రమంలో మృణాల్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ నిర్వహించారు. ఇందులో ఓ అభిమాని.. నేను నెగిటివ్ రివ్యూలు చూసి 'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమా చూడలేదు అంటూ కామెంట్ చేశాడు. దీనిపై ఆమె స్పందిస్తూ.. చాలా రివ్యూలు తప్పుదారి పట్టించేవిగా ఉంటున్నాయి. అందుకే రివ్యూలను నమ్మకుండా, మీరే సినిమా చూసి ఓ అభిప్రాయం ఏర్పరచుకోవాలి. ఒక్కోసారి సినిమా ఫెయిల్యూర్‌కి రివ్యూలే కారణం అవుతాయి అంటూ కుండ బద్దలు కొట్టేసింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రివ్యూలు చూసి ప్రేక్షకులు సినిమాకు వస్తే.. అసలు సినిమా ఆత్మను చూడక ముందే దాన్ని ఖండించేసినట్లే అవుతుందని ఇండస్ట్రీలో చాలామంది నిపుణులు కూడా చెబుతున్నారు. అయిన కూడా వారి ఆగడాలు ఆగడం లేదు.

# మృణాల్ ప్రేమలో ధనుష్

## చక్కర్లు కొడుతున్న రూమర్స్

కోలీవుడ్ స్టార్ ధనుష్ ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితంలోనూ మీడియా దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇటీవలే ఆయన 'కుబేర' మూవీతో విజయం అందుకున్నాడు. ప్రస్తుతం స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న ఇడ్లీ కడై మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నాడు. హీరోగా మాత్రమే కాకుండా, దర్శకుడు, నిర్మాత, సింగర్‌గాను పేరు తెచ్చుకున్న ధనుష్ గురించి ఎప్పడూ ఏదో ఒక రూమర్ నెట్టింట హల్‌చల్ చేస్తూనే ఉంటుంది. కొద్ది రోజుల క్రితం ధనుష్ సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యతో 18 ఏళ్ల పెళ్లి జీవితానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ధనుష్ పేరుతో పలు కథనాలు వెలువడుతున్నాయి. ఒకప్పడు మీనాతో పెళ్లి వార్తలూ అని చక్కర్లు కొట్టాయి. అయితే మీనా వాటిని ఖండిస్తూ, అలాంటి సంబంధమే లేదు, మా పాపను బాధించకండి అంటూ స్పందించారు. ఇప్పడు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్‌తో ధనుష్ ప్రేమలో ఉన్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. మృణాల్ పుట్టినరోజు వేడుకలో ధనుష్ ఆమెతో సన్నిహితంగా కనిపించడంపై, వీరిద్దరి మధ్య స్పెషల్ బాండ్ ఉందని టాక్ స్పీడ్‌గా స్ప్రెడ్ అయింది. చేతులు పట్టుకుని మాట్లాడుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో లవ్ గాసిప్‌కు బలం చేకూరింది. ఇక మృణాల్ బర్త్ డే రోజే ధనుష్ ముంబైకి ప్రత్యేకంగా విమానంలో వెళ్లడం, మృణాల్, అజయ్ దేవగన్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' స్పెషల్ స్క్రీనింగ్‌కు హాజరవ్వడం ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది. ధనుష్, మృణాల్ గతంలోను జంటగా కనిపించారు. జూలై 3న, రచయిత్రి-నిర్మాత కనికా ధిల్లన్ ధనుష్ తదుపరి చిత్రం 'తేరే ఇష్క్ మే' కోసం ఏర్పాటు- చేసిన పార్టీలో మృణాల్ సందడి చేసింది. కనికా షేర్ చేసిన ఫొటోల్లో మృణాల్, ధనుష్ సినిమా యూనిట్ తో కలిసి చిరునవ్వులు చిందిస్తూ ఫోటోలకు ఫోజులివ్వడంతో అప్పటి నుండే వీరిద్దరు డేటింగ్ చేస్తున్నారన్న రూమర్స్ గట్టిగా వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు ధనుష్ కానీ, మృణాల్ కానీ ఈ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం వీరిద్దరిపై రకరకాల కామెంట్లు- కొనసాగుతున్నాయి.



EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685